ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 17.0

పొగాకు అమ్మకాల్లో
'జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-2' ఫస్ట్
ముగిసిన వర్జీనియా పొగాకు అమ్మకాలు
■ లోపలి పేజీలో..

సారొస్తున్నారు..!

రేపు సీఎం చంద్రబాబు పర్యటన

- శరవేగంగా ఏర్పాట్లు.. పటిష్ఠ భద్రత..ఉంగుటూరులోనే యంత్రాంగమంతా మకాం
- ఏర్పాట్లను పరిశీలించిన ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఏలూరు/తాడేపల్లిగూడెం/నిడమర్రు,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు డిసెంబరు 1న ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పటిష్ఠ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. అధికారులకు అందిన సమాచారం ప్రకారం గోపీనాథపట్నంలో తొలుత సీఎం పెన్షన్ల పంపిణీలో పాల్గొంటారు. దీనికోసం నలుగురు లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. వారితో సీఎం ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం గొల్లగూడెం వద్ద ప్రజావేదిక వద్ద బహిరంగ సభలో సీఎం మాట్లాడతారు. ఇక్కడ పొలాలను సభావేదికగా అనువుగా తీర్చిదిద్దుతున్నారు. పొలాలను చదును చేసి, గ్రావెల్ పోసి సిద్ధంగా చేస్తున్నారు. పది వేల మంది హాజరయ్యే అవకాశం ఉంది. దానికి తగ్గట్టుగా ప్రవేశద్వారాలు, వీఐపీలు వెళ్లే మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడ పొరపాట్లకు తావివ్వకుండా తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీలు పర్యవేక్షించారు. అక్కడే నియోజకవర్గంలో పీ-4 కింద బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న దాతలతో ముఖాముఖిగా సమావేశం కానున్నారు. భోజన విరామం తర్వాత నియోజకవర్గ టీడీపీ నాయకులతో పార్టీ సమావేశం నిర్వహించనున్నారు.

సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్

- ఉదయం 10.30 : ఉండవల్లిలో నివాసం నుంచి బయలుదేరుతారు.
- 10.55 : ఉంగుటూరు మండలం గొల్లగూడెం హెలీపాడ్‌కు చేరుకుంటారు.
- 10.55 - 11.10 : ప్రజాప్రతినిధులు, అధికారులు రిసీవింగ్
- 11.10 - 11.20 : హెలీప్యాడ్ నుంచి గోపీనాథపట్నంకు రోడ్డుమార్గంలో ప్రయాణం
- 11.20 - 11.40 : గోపీనాథపట్నంలో ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ
- 11.40 - 11.50 : గోపీనాథపట్నం నుంచి గొల్లగూడెంకు రోడ్డుమార్గంలో పయనం
- 11.50 - 11.55 : గొల్లగూడెం సభాప్రాంగణం వద్ద ప్రభుత్వ శాఖల స్టాల్స్ సందర్శన
- 11.55 - 1.25 : గొల్లగూడెం వద్ద ప్రజావేదిక సభ
- 1.25 - 2.00 : రిజర్వుడు సమయం
- 2.05 - 3.35 : ముఖ్య కార్యకర్తలతో సమావేశం
- 3.35 : హెలికాప్టర్‌లో ఉండవల్లికి ప్రయాణం



● సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం సాయంత్రం హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ చుట్టూ మూడుసార్లు చక్కర్లు కొట్టింది. గ్రామస్థులు ఆసక్తిగా ఎదురుచూశారు.



హెలీపాడ్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని ఆంజనేయులు

సీఎం పర్యటనను విజయవంతం చేయండి : గన్ని, పత్సమట్ల

ఉంగుటూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను కార్యకర్తలు నాయకులు విజయవంతం చేయాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఈ మేరకు హెలీప్యాడ్ స్థలాన్ని శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, ప్రజావేదికలో ద్వారా ప్రజలతో బహిరంగ సమావేశం, పీ4లో మార్గదర్శకుల గుర్తింపు, కేడర్ మీటింగ్, భద్రతా చర్యలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాకకోసం ఉంగుటూరు నియోజకవర్గ ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని, ఆయన రాక ఉంగుటూరు - మిగతా 8వ పేజీలో

మూడు రోజుల నుంచి మకాం

జిల్లా అధికారులతో పాటు జేసీ అభిషేక్ గౌడ, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మూడు రోజుల నుంచి సభాస్థలి, సీఎం పర్యటించే ప్రాంతాల వద్ద మకాం వేశారు. వివిధ శాఖల వారీగా బాధ్య తలను కలెక్టర్ అప్పగించారు. చాలా కాలం తర్వాత ప్రజలతో దగ్గరగా సీఎం చంద్రబా బు సభ ఉండడంతో పటిష్ఠ నిఘా, ఇతర ఏర్పాట్లను చేస్తున్నారు.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

ముఖ్యమంత్రి పర్యటన వల్ల రోడ్లకు మోక్షం కలుగుతోంది. చేబ్రోలు-దూబచర్ల, నారాయణ పురం-గణప వరం రోడ్లలో గోతులను యుద్ధప్రాతిపదికన రోడ్లు భవనాలు శాఖ అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు.



చిన్నాను కలవకపోతే..
పనులెలా పెడతాం!

- తీవ్ర దుమారం రేపిన చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి వ్యాఖ్యలు
- రసాభాసగా జంగారెడ్డిగూడెం కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'వర్కులు కావాల్సిన మున్సిపల్ కౌన్సిలర్లంతా మా ఇంటికి వచ్చి వారి వార్డులో పనులు పెట్టించుకుంటున్నారు.. మీరు మాత్రం రారు. చిన్నా గారిని అడగరు.. చిన్నా గారిని అడగకపోతే మీకు పనులెలా పెడతాము అనుకుంటున్నారు'.. అని మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి నాల్గొవ వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ (జనసేన)ను ఉద్దేశించి శనివారం జరిగిన జంగారెడ్డిగూడెం కౌన్సిల్ సమావేశంలో వ్యాఖ్యానించడంతో తీవ్ర దుమారం చెలరేగింది. సమావేశం రసాభాసగా మారింది.

చైర్‌పర్సన్ నాగలక్ష్మి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగానే వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు ఆధ్వర్యంలో వైసీపీ కౌన్సిలర్లు ప్ల కార్డులు చేతపట్టుకుని ప్రభుత్వం ఫ్రీజ్ చేసిన రూ.8.5 కోట్ల మున్సిపల్ సాధారణ నిధులను వెంటనే విడుదల చేయాలని నినదిస్తూ సభ హాలులోకి వచ్చారు. సమావేశం ప్రారంభమైన తరువాత నాల్గొవ వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లా డుతూ గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో తన వార్డులో ప్రధాన డ్రెయిన్ నిర్మాణానికి టేబుల్ అజెండాలో పెట్టిన రూ.35 లక్షల వర్కు తీర్మానం అయిన తరువాత ఎందుకు రద్దు చేశారో చెప్పాలంటూ చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. దీనికి చైర్‌పర్సన్ సమాధానమిస్తూ గత సమావేశానికి అధ్యక్షత వహించిన వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు తమకు తెలియకుండా టేబుల్ అజెండాలో పెట్టారని, అందుకనే రద్దు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త చిన్నాను వర్కు అడిగిన కౌన్సిలర్లందరికీ వర్కులు మంజూరు చేస్తున్నారు.. మీరు మా ఇంటికి రానందువల్లే మీకు వర్కులు పెట్టడం లేదంటూ సమాధానమిచ్చారు. దీంతో కౌన్సిలర్ తాతాజీ చైర్‌పర్సన్ వ్యాఖ్యలను నిరసిస్తూ పోడియం ముందు బైఠాయించారు. 'నేనేమీ నా సొంత పని అడగడం లేదు.నా వార్డు ప్రజలకోసమే అడుగుతున్నా. నా వార్డులో డ్రెయిన్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తే కానీ పోడియం వద్ద నుంచి లేవను' అంటూ పట్టుబట్టారు. కమిషనర్ కెవి.రమణ, పలువురు కౌన్సిలర్లు ఆయనకు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. అనంతరం చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు టేబుల్ అజెండాలో నాల్గొవ వార్డు డ్రెయిన్ నిర్మాణానికి రూ.35 లక్షలు నిధులు కేటాయించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. సభ ప్రారంభానికి ముందు పట్టణం గ్రేడ్-1 మునిసిపాలిటీ కావడానికి కారణం మేమంటే మేమంటూ టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు వాదులాడుకున్నారు. కేవలం ఎమ్మెల్యే, ఎంపీల సహకారం తోనే గ్రేడ్-1 మున్సిపాలిటీ అయ్యిందని కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి తేల్చిచెప్పారు.



చైర్‌పర్సన్ పోడియం ఎదుట బైఠాయించిన కౌన్సిలర్ వలవల తాతాజీ

ఇంటి పన్నులు చెల్లిస్తామంటే కట్టించుకోవడం లేదు..!



ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి శివారు అన్నవరం కాలనీలో నిర్మించుకున్న తమ గృహాలను పంచాయతీ అధికారులు గుర్తించడం లేదని, ఇంటి పన్ను కట్టించుకోవడం లేదని ఆ కాలనీ మహిళలు పలువురు తహసీల్దార్ లతీఫ్ పాషాకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం తహసీల్దార్‌కు మెమోరాండం అందజేశారు. తమ ఇళ్లకు అసెస్‌మెంట్ నెంబర్ ఇస్తే ఇంటి పన్ను చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా ముదినేపల్లి పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆ మెమోరాండంలో పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



ఎయిడ్స్ మృతులకు సంఘీభావంగా శనివారం రాత్రి డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన క్యాండిల్ లైట్ స్మృత్యంజలి ప్రదర్శన

చీకటి నుంచి వెలుగులోకి..

- జిల్లాలో హెచ్ఐవీ వ్యాప్తి తగ్గుముఖం
- రేపు ప్రపంచ ఎయిడ్స్ దినం

ఏలూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అంటువ్యాధికాదు.. అంటించుకునే వ్యాధిగా ప్రాచుర్యంలోకి వచ్చిన హెచ్ఐవీ/ ఎయిడ్స్ వ్యాప్తి జాడలు జిల్లాలో క్రమేణా తగ్గుముఖం పడుతున్నాయి. పుష్కరకాలం క్రితం జిల్లా జనాభాలో 3.5శాతంగా వున్న వైరస్ వ్యాధిగ్రస్తులు ప్రస్తుతం 0.1శాతాని కంటే తక్కువకు చేరడమే దీనికి నిదర్శనంగా అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మారుమూల ప్రాంతాలకు సైతం హెచ్ఐవీ టెస్టులను విస్తృతం చేయడం, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను వేగవంతం చేయడం, తల్లి నుంచి శిశువుకు వైరస్ సోకడాన్ని ఏడాది కాలంలో శూన్యస్థితికి తీసుకురావడమే కొత్తగా హెచ్ఐవీ కేసుల తగ్గుముఖానికి ఓ కారణంగా వైద్యఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని (డిసెంబరు1)పురస్కరించుకుని జిల్లాలో హెచ్ఐవీ వ్యాప్తి, నియంత్రణాచర్యలపై పరిశీ లన..

మహమ్మారి బారిన మహిళలే ఎక్కువ!

జిల్లాలో ప్రస్తుతం మొత్తం 8,745మంది హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో వున్నట్టు తేలింది. వీరిలో అత్యధికులు ఎయిడ్స్ తీవ్రతను నియంత్రించే యాంటీ రెట్రోవైరల్ థెరపీ(ఏఆర్టీ)మందులను వినియోగిస్తున్నవారే. ఆ ప్రకారం ఏఆర్టీ ట్రీట్‌మెంట్‌ను పొందుతున్న వారిలో పురుషులు 3,511 మంది ఉండగా, మహిళలు 4,952 మంది మందులను వినియోగిస్తున్నారు. వీరితోపాటు లింగమార్పిడి (ట్రాన్స్‌జెండర్) చేయించుకున్న వ్యక్తులు 21 మంది, పిల్లలు 261 మంది ఏఆర్టీ మందులను తీసుకుంటున్నారు. వీరందరికీ నెలనెలా ఏఆర్టీ మందులను ఇవ్వడంతో పాటు, వాటిని వాడుతున్నదీ, లేనిదీ పర్యవేక్షించేందుకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలలో ఏఆర్టీ సెంటర్లు, చింతలపూడి, భీమడోలు, నూజివీడు, కొయ్యలగూడెం, కైకలూరుల్లో లింక్ ఏఆర్టీ సెంటర్లు పనిచేస్తున్నాయి.

ముందస్తు నివారణ కార్యకలాపాలు

హెచ్ఐవీ/ఎయిడ్స్‌ను ముందస్తుగా నివారించాలంటే అరక్షిత లైంగిక పద్ధతులను అరికట్టడమే కీలకమని వైద్యవర్గాలు చెబుతుంటాయి. దీనికనుగుణంగానే జిల్లాలో హైరిస్క్ జనాభాగా గుర్తించిన ఫిమేల్ సెక్స్‌వర్కర్లు 5,467 మంది, ఎంఎస్ఎం (మెన్ హేవింగ్ సెక్స్ విత్ మెన్) 1000 మంది, లింగ మార్పిడి చేయించుకున్న వారు (ట్రాన్స్‌జెండర్లు) 221 మంది వున్నట్టుగా గుర్తించిన వైద్యఆరోగ్యశాఖ, సంబంధిత వ్యక్తుల నుంచి ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందస్తు చర్యలను తీసుకుంటోంది. వీరికి తరచూ సుఖవ్యాధుల పరీక్షలు నిర్వహించడం, సిఫిలిస్, హెచ్ఐవీ టెస్టింగ్‌లు చేయడం ద్వారా ప్రవర్తనా మార్పులను తీసుకొచ్చేందుకు ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ (ఎన్జీవో)ల ద్వారా పర్యవేక్షణ కార్యక్రమాలను చేపడుతోంది.

ఎక్కువ టెస్టులు చేయడంతోనే నివారణ, నియంత్రణ



హెచ్ఐవీ సోకిన వారికి వైరస్ తీవ్రతను తెలుసుకునేందుకు నిర్వహించే వైరల్ లోడ్ పరీక్షలు 13,336 ఈ ఏడాది ఇప్పటివరకు నిర్వహించాం. ఇక సుఖ వ్యాధుల ద్వారా వైరస్ సంక్రమించేందుకు అవకాశాన్ని 11,703 స్క్రీనింగ్ టెస్టుల ద్వారా తెలుసుకున్నాం. అన్ని ప్రభుత్వశాఖలను సమన్వయ పరుచుకుని అన్ని విద్యాసంస్థలు, గ్రామీణప్రాంతాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గిరిజన ప్రాంతాలు, పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు, వలస కార్మికులకు టెస్టులను ఈ ఏడాది మరింత చేరువ చేసేందుకు సంచార టెస్టింగ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చాం.

- డాక్టర్ లక్ష్మీనారాయణ, డీఎల్ఏటీవో, ఏలూరు జిల్లా.

టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ పరీక్షల ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆగస్టు 24న జరిగిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ పరీక్షల ఫలితాలనను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణుల పాస్ సర్టిఫికెట్లను సంబంధిత జిల్లాల డీఈవో కార్యాలయాల నుంచి పొందవచ్చన్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాల
దరఖాస్తుకు నేటితో గడువు ముగింపు

ఏలూరు రూరల్,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను వందశాతం సబ్సిడీతో ఇవ్వనుంది. అందుకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈనెల 30వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. పదో తరగతి ఉత్తీర్ణులై, స్వయం ఉపాధి పొందుతున్న, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు అర్హులు, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు వీటిని పొందవచ్చు. ఏడీడీఏపీఏసీజీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఏడీ బి.రామ్‌కుమార్ తెలిపారు.



దిత్వా గుబులు

ముంచుకొస్తున్న తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన

ముదినేపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను రైతులను వణికిస్తోంది. తుఫాన్ ప్రభావంతో ఫలితంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుండడంతో ముదినేపల్లి ప్రాంత రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో సార్వా వరి కోతలు పూర్తికాగా, ధాన్యాన్ని ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రోడ్లకు చేర్చి తేమ శాతం తగ్గించేందుకు ఆరబెట్టారు. ధాన్యం పూర్తిగా ఆరకముందే తుఫాన్ ఫలితంగా ఆకాశం మేఘావృతం కావడంతో ఎండలు లేక ధాన్యం తడిపొడిగానే ఉంది. వందలాది ఎకరాల్లో వరిపైరు పనమీద ఉంది.ఈ పరిస్థితుల్లో తుఫాన్ హెచ్చరికలతో రైతులకు కంటి కునుకు లేకుండా చేస్తోంది.



ముదినేపల్లి వద్ద ధాన్యం రాశులపై కప్పిన బరకాలు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

బొర్రంపాలెంలో ఫుడ్ ఫెస్టివల్

టి.నరసాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):బొర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జిల్లా స్థాయి ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. పాఠశాల విద్యార్థులు 72 మంది 50 రకాల ఆహార పదార్థాలను తయారు చేశారు. కొయ్యలగూడెం డీవైఈవో రామన్నదొర, జీసీడీవో నవీన, ఎంఈవో రామూర్తి వాటిని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఫుడ్ ఫెస్టివల్ విభాగంలో బొర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే నూనెలు, మైదా, పంచదారను వినియోగించకుండా ఆహార పదార్థాలను తయారు చేయడం ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో విశేష మన్నారు. మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు లింగస్వామి, అహ్మద్‌ఆలీ, శ్రీనివాస్, త్రినాథ్, టీటీవో శ్రీను, బొర్రంపాలెం పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పులుల గణన
ఎనిమిది ప్రత్యేక రైళ్లు
■ లోపలి పేజీలో..

మద్ది ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు



మద్ది ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకాలు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామికి శనివారం ఉదయం పంచామృతాభిషేకాలను ఆలయ అర్చకులు, వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. వివిధ సేవల రూపంలో దేవస్థానంకు రూ.1,30,848 ఆదాయంగా లభించినట్టు, ఆలయ నిత్యాన్నదాన సత్రంలో 1650 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.

కొండచిలువతో హల్‌చల్



ద్వారకాతిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో ఓ వ్యక్తి మద్యం మత్తులో మెడలో కొండచిలువను వేసుకుని హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. గ్రామానికి చెందిన లాజర్ అనేవ్యక్తి శుక్రవారం రాత్రి చేపలకోసం చెరువులో వల వేశాడు. ఉదయం చెరువు వద్దకు వెళ్లే సరికి వలలో చిక్కుకుని కొండచిలువ కన్పించింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న లాజర్ దాన్ని కొట్టి చంపి మెడలో వేసుకుని గ్రామంలో కలియతిరిగాడు. అలాగే దేవస్థానం పాఠశాలకు వెళ్లగా విద్యార్థులు ఆ భారీ కొండచిలువను చూసి భయాందోళనలకు గురయ్యారు. తర్వాత అతన్ని అక్కడి నుంచి బయటకు పంపివేశారు

19న సోగ్గాడు స్వర్ణోత్సవాలు



హైదరాబాద్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 19న శోభన్ బాబు నటించిన సోగ్గాడు చిత్రం స్వర్ణోత్సవ సంబరాలను నిర్వహిస్తామని సురేష్ సంస్థల అధినేత నిర్మాత దగ్గుపాటి సురేష్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో అఖిల భారత శోభన్ బాబు సేవాసమితి సభ్యులు, అభిమానుల ఆధ్వర్యంలో సోగ్గాడు స్వర్ణోత్సవ సంబరాల పోస్టర్‌ను రచయిత పరుచూరి గోపాలకృష్ణ, దర్శకులు కె. మురళి మోహనరావు, ఎ.కోదండరామిరెడ్డి, నిర్మాతలు రాశి నరసింహారావు, రేలంగి నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే జేష్ఠ రమేష్ బాబు, శోభన్ బాబు కుటుంబం తరుపున మేనల్లుడు, ప్రముఖ బిల్డర్ గద్దె నవీన్ ఆవిష్కరించారు. వచ్చేనెల 19న నాటికి శోభన్ బాబు నటించిన సోగ్గాడు చిత్రం 50 వసంతాలు పూర్తి చేసుకుంటుందని, వసంతాల ఉత్సవాలను అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, పూడి శ్రీనివాస్, బి. బాలసుబ్రమణ్యం, టి. సాయికామరాజు తెలిపారు. ఈ విషయాలను భీమవరంలో స్థానిక శోభన్ బాబు సేవా సమితి సభ్యులు తెలిపారు.

జాతీయస్థాయి క్రీడలకు సెయింట్ థెరిస్సా విద్యార్థినులు



ఏలూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్-19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్ టోర్నమెంట్లలో ప్రతిభ కనబరిచిన ఏలూరు సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల విద్యార్థినులు వచ్చే ఏడాది జనవరి 2న రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్‌లలో జరిగే జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్, ఫిజికల్ డైరెక్టర్ ఆండాళ్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎస్జీఎఫ్ బాస్కెట్‌బాల్ జట్టులో డి.సాయిభవాని, బి.దేవిశ్రీ, హ్యాండ్‌బాల్ జట్టుకు కె.జ్యోత్స్న పాల్గొంటారని వివరించారు. హర్యానాలో జరిగే జాతీయ రెజ్లింగ్ పోటీలో వై.నందిని పాల్గొంటుందని తెలిపారు. జాతీయస్థాయి క్రీడలపోటీలకు ఎంపికైన కళాశాల విద్యార్థినులను అభినందించారు.

జాతీయ హాకీ పోటీలకు భవన్స్ విద్యార్థి ఎంపిక



జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన ప్రకాష్‌ను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీలకు భీమవరం భారతీయ విద్యాభవన్స్ విద్యార్థి ఎంపికైనట్లు అకడమిక్ డైరెక్టర్ మంతెన రఘుపతిరాజు తెలిపారు. విద్యార్థి దిరిశాల కార్తీక్ సాయి ప్రకాష్ చిత్తూరు జిల్లా చంద్రగిరిలో స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తరుపున రాష్ట్రస్థాయిలో జరిగిన హాకీ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని అన్నారు. విద్యార్థి ప్రకాష్ రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కోచ్ దుర్గారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమాలు ప్రజలకు చేరువ కావాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు

పెనుగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలు ప్రజలకు మరింత చేరువ కావాలని ప్రముఖ వైద్యులు, విద్యావేత్త కలిదిండి రామచంద్రరాజు అన్నారు. శనివారం పెనుగొండలోని సీఐటీయు జిల్లా 13వ మహా సభలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. నేడున్న పరిస్థితిల్లో ప్రజా ఉద్యమాల ఆవశ్యకత చాలా ఉందన్నారు. రాష్ట్ర సీఐటీయు ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చట్ట సభలలో ఉద్యోగులు కార్మికులు తరుపున మాట్లాడటం జరుగుతుందని ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. సర్పంచ్‌నక్కా శ్యామలా సోని శాస్త్రి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు అంటే అవి అభివృద్ధికి దోహదపడేవన్నారు. రానున్న కాలంలో సమరశీల ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సీతారామ్ ఏచూరి , చింతకాయల బాబూరావు, అల్లూరి సత్యనారాయణ ,షేక్ బాబ్జి , పొన్నాడ రాము తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.





టీటీడీ కల్యాణ మండపం చుట్టూ ముళ్ల పొదలు, పెరిగిన పిచ్చి మొక్కలు

నాడు నిత్యతోరణం.. నేడు కళావిహీనం

- ఏలూరు టీటీడీ కల్యాణ మండపం దుస్థితి
- మండపం ఆవరణలో ఏపుగా పెరిగిన పొదలు
- పెచ్చులూడిపోతున్న భవనం

ఏలూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కళకళలాడే కల్యాణ మండపం నేడు కళావిహీనంగా ఉంది. ఇది ఏలూరులోని టీటీడీ కల్యాణ మండపం దుస్థితి. తిరుమల తిరు పతి దేవస్థానం ఆధ్వర్యంలో 1990లో స్థానికంగా కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఇక్కడ నుంచి తిరుమల తిరుపతికి స్వామి వారి దర్శనానికి, గదులు బుకింగ్‌కు, కల్యాణ మండపం నిర్వహణ సిబ్బంది విధులు ఇక్కడే నిర్వహించేవారు. అంతేకాకుండా పుస్తకాలు డైరీలు, స్వామివారి క్యాలెండర్లు అందించేవారు. కళ్యాణమస్తు ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన అన్నమయ్య సంకీర్తనలు, తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతుండేవి. నిర్వహణ బాధ్యతలు సంగతి ఎలా ఉన్నా ఈ కల్యాణ మండపాన్ని ప్రైవేటు వ్యక్తులకు వివిధ వేడుకలు, కార్యక్రమాలకు అద్దెకు ఇచ్చేవారు. దీని వల్ల ఆదాయం సమకూరేది. ఈ కల్యాణ మండపం ఉండడం వల్ల అన్ని రకాల వేడుకలు నిర్వహించేవారు. కల్యాణ మండపం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిపోవడంతో టీటీడీ కల్యాణ మండపం ప్రభావం పూర్తిగా కోల్పోయింది. కొంత కాలంగా మండపం చుట్టూ పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారైంది. భవనం స్లాబులు పెచ్చులూడిపోతున్నాయి. ప్రస్తుతం కల్యాణ మండపం నిర్వహణ లేకపోవడం వల్ల పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. రాలిన చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, పశువులు దర్శనమిస్తున్నాయి. లోపలికి వెళ్లే ద్వారానికి తాళాలు వేసి ఉన్నాయి. ఈ కల్యాణ మండపం వినియోగంలోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. సౌలభ్యంగా ఉండే కల్యాణ మండపాన్ని టీటీడీ నిరుపయోగంగా వదిలేయడం వల్ల భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు కనిపిస్తే ఒట్టు!

దుమ్ము రేపుతున్న రహదారి

బుట్టాయగూడెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):పై ఫోటోలోని దృశ్యాన్ని చూస్తే బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి దుస్థితి ఏమిటో ఇట్టే అర్థమవుతుంది. ఇక్కడ 'రోడ్డు కనిపిస్తే ఒట్టు' అంటూ వాహనదారులు దండాలు పెడుతున్నారు. నిన్న మొన్నటి వరకు వర్షపు నీటితో, బురదతో భయపెట్టిన రహదారి ఇప్పుడు దుమ్ముతో కుమ్మేస్తుంది. వాహనాల రాకపోకల సమయంలో రోడ్డు కనబడనంతగా దుమ్ము లేచిపోతుంది. ఏదైన పెద్ద వాహనం ముందుగా వెళ్ళిందో వెనుక ఉన్నవారి గతి ఏమిటో తెలుసుకోవచ్చు. రోడ్డంతా దుమ్ముతో నిండిపోవడమేకాకుండా ప్రయణాలు ప్రమాదకరంగా మారుతున్నాయంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. రోడ్డు మరమ్మతులకు పీఎంఎస్ఆర్ ఈసీఎస్ నిధులు విడుదలైనా పనులు ముందుకు సాగడంలేదు. మొదట్లో రోడ్డును తవ్వి రజనుతో రోడ్డును వేసిన అధికారులు తర్వాత ఆటుగా కన్నెత్తి చూడటమే మానేశారు. దీంతో ప్రజలకు, వాహనదారులకు నిత్యం ప్రత్యక్ష నరకం కళ్ళముందే కనబడుతుంది. ఇటీవల రహదారి పనులు నిలిచిపోవడంపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులపై సీరియస్ అయినట్లు సమాచారం. రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముక్కు 'మూసుకుని' వెళ్లాల్సిందే...!

తహసీల్దార్ కార్యాలయంలో టాయిలెట్స్ అధ్వానం





ఊడిపోయిన టాయిలెట్ తలుపు... నాచు, మురికి పట్టి అధ్వానంగా ఉన్న టాయిలెట్

కాళ్ళ, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రసంగాలు చెప్పే ప్రభుత్వ అధికారుల కార్యాలయాలు అపారిశుధ్యంతో దర్శనమిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. కాళ్ల తహసీల్దార్ కార్యాలయం మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉండి దుర్వాసనతో దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లకు ఉన్న తలుపులు విరిగిపోయి, నాచు పట్టి అధ్వానంగా ఉన్నాయి. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందితోపాటు నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనులు నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారు సైతం టాయిలెట్‌కి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విరిగిన తలుపు ఉన్న టాయిలెట్‌కి వెళ్ళడానికి ప్రధానంగా మహిళా వీఆర్వోలు, ఉద్యోగులు చాలా ఇబ్బందికి గురవుతున్నామని చెబుతున్నారు. కార్యాలయంలో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి మహిళా అధికారులు కూడా హాజరవుతున్నారు. వాళ్ళు కూడా ఇవే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఉద్యోగాలు పొందిన యువతకు అపాయింట్‌మెంట్ లెటర్స్ అందిస్తున్న ఎంపీ శ్రీనివాసవర్మ.. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే అంజిబాబు

యువతకు ఉద్యోగాలు కల్పనే లక్ష్యం

భీమవరం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పలు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందినవారికి అపాయింట్‌మెంట్ లెటర్స్‌ను కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి అందించారు. కేంద్ర మంత్రి వర్మ మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో అనకాపల్లి రామాయణపట్టణం ప్రాంతాల్లో ఏర్పాటు కాబోయే పరిశ్రమల్లో లక్షా 40 వేల ఉద్యోగాలకు అవకాశం ఉందని, ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాయన్నారు. ఈ జాబ్‌మేళాకు 2600 మంది రిజిస్ట్రేషన్ అవ్వడం గొప్ప విషయమని, ఇటువంటి జాబ్ మేళాలు మరిన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ విద్యార్థులు మొదటిగా చిన్న ఉద్యోగమైనా పెద్ద ఉద్యోగమైనా చేరి తర్వాత తన అనుభవంతో పెద్ద ఉద్యోగాల వైపు వెళ్ళాలన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలతో ఎంవోయూ కుదుర్చుకున్నదని అన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జాబ్ మేళాలో 600 పైగా ఉద్యోగాలు పొందారని, మరికొన్ని ఉద్యోగాలకు సెకండ్ ఇంటర్వ్యూ అనంతరం మరొక 400 మందికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఏపీ ఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, డైరెక్టర్ డా. జగపతిరాజు, ప్రిన్సిపాల్ డా. మురళీ కృష్ణంరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దిలీప్ చక్రవర్తి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డా. పి.లోకమాన్ తదితరులు పాల్గొన్నారు.



వెటర్నరీ పాలిటెక్నిక్ ఓవరాల్ చాంపియన్స్‌గా గరివిడి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ పశువైద్య విశ్వవిద్యాలయ పరిధిలోని 13వ పాలిటెక్నిక్ ఇంటర్ కళాశాలల గేమ్స్ క్రీడ, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా గరివిడి వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నిలిచింది. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం శనివారం నిర్వహించారు. ఉద్యాన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు విజేతలను అభినందించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వెనిలవలస, గరివిడి, రామచంద్రాపురం, వెంకట్రామన్నగూడెం, రాపస్, సదుం, పలమ నేరు, భన్వాసి, మడకసిర, కొమ్మమరిసి కళాశాలల నుంచి 270 మంది క్రీడాకారులు హాజరయ్యారు. నాలుగు రోజుల పాటు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో అత్యధికంగా మడకసిర విద్యార్థులు ఎక్కువ క్రీడల్లో విజేతలుగా నిలిచారు. వెంకట్రామన్నగూడెం పాలిటెక్నిక్ విద్యార్థులు ఖోఖో, టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచారు.

నెట్‌బాల్ విజేత విశాఖ

బాలికల విభాగంలో పశ్చిమకు ద్వితీయ.. బాలుర విభాగంలో తృతీయ స్థానాలు



ద్వితీయ స్థానంలో నిలిచిన పశ్చిమ బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండ లం శృంగవృక్షం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 27వ తేదీ నుంచి జరుగుతున్న అంతర్ జిల్లాల అండర్-14 నెట్ బాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన విశాఖపట్నం, రెండవ స్థానంలో నిలిచిన పశ్చిమ గోదావరి, మూడవ స్థానంలో నిలిచిన కృష్ణా జట్లకు బహుమతులు అందించారు. అదేవిధంగా బాలుర విభాగంలో గెలుపొందిన విశాఖపట్నం, రెండవ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి, మూడవ స్థానంలో నిలిచిన పశ్చిమ గోదావరి బాలుర జట్లకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు బహుమతులు అందించారు.

జాతీయ నెట్‌బాల్‌కు పశ్చిమ విద్యార్థులు

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ అంతర్ జిల్లాల అండర్-14 నెట్ బాల్ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహించి మెరుగైన ప్రతిభ కనబర్చిన బాలుర, బాలికలను జాతీయ స్థాయి జట్టుకు శనివారం శృంగవృక్షం గ్రామంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో ఎంపిక చేశారు. బాలికల రాష్ట్ర జట్టుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ముగ్గురు బాలికలు టి.వసుంధర (గొరగనమూడి హైస్కూల్), పి. బిందుశ్రీ మంజు (తోలేరు హైస్కూల్), జి.తేజశ్రీ (శృంగవృక్షం హైస్కూల్), బాలుర రాష్ట్ర జట్టుకు పశ్చిమ నుంచి ఇద్దరు బాలురు కె.ఆంటోని (గొరగనమూడి హైస్కూల్), వి.గౌతమ బుద్ధ (తోలేరు హైస్కూల్)లను ఎంపికచేశారు.

• ఆనందంగా ఉంది

నెట్ బాల్ పోటీల్లో అండర్-14 జట్టు తరపున జిల్లాకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా జట్టులో మెరుగ్గా రాణించి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉంది.

- టి.వసుంధర (గొరగనమూడి)



• క్రీడలకు ప్రోత్సాహం అందించాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో అరకొర సౌకర్యాలతోనే క్రీడలు ఆడుతున్నాం. అన్ని సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే మరింత మంది క్రీడట పట్ల ఆసక్తి కనబర్చడమే కాకుండా దేశానికి మంచి పేరు తెచ్చే విధంగా క్రీడాకారులు తయారవుతారు.

- పి. బిందుశ్రీ మంజు (తోలేరు)

• ఉత్సాహాన్ని ఇచ్చింది



పాఠశాలల్లో క్రీడలకు మరింత పెద్ద పీట వేయాలి. అప్పుడే మరింత మంది ఆటలపై ఆసక్తి కనబర్చుతారు. నెట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపివ్వడమే కాకుండా జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే విధంగా అవకాశం లభించడం ఉత్సాహాన్నిచ్చింది.

- జి. తేజశ్రీ (శృంగవృక్షం హైస్కూల్)

• క్రీడా మైదానాలు అభివృద్ధి పరచాలి

గ్రామాల్లో ఉండే ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా మైదానాలు కరువయ్యాయి. ఆడుకుందామంటే సరైన ఆటస్థలాలు ఉండటం లేదు. పాఠశాలల్లో చదువుకుంటూనే క్రీడల్లో రాణించాలంటే ఆటస్థలాలు తప్పనిసరి. అరకొర వసతులతో ఉన్న మైదానంలోనే ఆటలాడుకుంటున్నాం. ప్రభుత్వాలు స్పందించి ఆట స్థలాలపై శ్రద్ధ చూపాలి. అప్పుడే మంచి క్రీడాకారులు తయారవుతారు.



- కె. ఆంటోని (గొరగనమూడి హైస్కూల్)

• మరిన్ని పతకాలు సాధిస్తా



నాది మధ్యతరగతి కుటుంబం. తల్లిదండ్రుల కష్టంతోనే చదుకుంటున్నా. భవిష్యత్‌లో నెట్ బాల్‌లో మరిన్ని పతకాలు సాధించి జాతీయ స్థాయిలో భారత జట్టులో స్థానం సంపాదించడమే లక్ష్యం. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి మరింత మంది నాలాంటి క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తా.

- వి. గౌతమ్‌బుద్ధ (తోలేరు హైస్కూల్)

రాష్ట్ర జట్టుకు ఎంపికైన బాలురు, బాలికలు



ఎంపికైన ఆంధ్రప్రదేశ్ బాలురు, బాలికల జట్లు

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే నెట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడే అండర్-14 బాలురు, బాలికల జట్టును శనివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృం గవృక్షం గ్రామంలో పరిశీలకులు కల్పన, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు సునీత, మల్లేశ్వరరావు, పీడీలు చిట్టిబాబు, ఖుద్దూస్, విజయలక్ష్మి తదితర పీడీలు ఎంపిక చేశారు.

బాలికల జట్టు: బి.భాగ్యశ్రీ (విశాఖపట్నం), ఎన్.వెంకట నాగ భవానీ ఈక్షిత (విశాఖపట్నం), పల్లి శ్రీగాయత్రి (విశాఖపట్నం), పెచ్చెట్టి బిందుశ్రీ మంజు (పశ్చిమగోదావరి జిల్లా), పి.వసుంధర (పశ్చిమగోదావరి), యండమూరి హన్నా (కృష్ణా), సీహెచ్. విద్యాలక్ష్మి (తూర్పు గోదావరి), ఎం.ప్రణీత (కడప), ఎంకే కీర్తిక (చిత్తూరు), ఎం.అమూల్య (గుంటూరు), డి.మెహరీన్ (నెల్లూరు), జి. తేజశ్రీ (పశ్చిమ).

బాలుర జట్టు

కె. సోహిల్ (విశాఖపట్నం), ఎం. ధనుష్ మణికంఠ (విశాఖపట్నం), పి.చందు వెంకట నిఖిల్ (విశాఖపట్నం), ఎం. వెంకట శ్రీనివాస్ కుమార్ (తూర్పు గోదావరి), కె.సృజన్ (తూర్పు గోదావరి), కె.ఆంటోని (పశ్చిమ గోదావరి), బి.లోకేష్ (కృష్ణా), వి.డిల్లీబాబు (నెల్లూరు), కెవి బాలు (గుంటూరు), ఆర్.అజయ్‌కుమార్ (విజయనగరం), టీజే శేషాద్రి (చిత్తూరు), వి.గౌతమ్‌బుద్ధ (పశ్చిమ).





శ్రీవారి క్షేత్రం భక్తులతో కళకళ

ద్వారకాతిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోవిందుని నామాలతో శ్రీవారి క్షేత్రం మారుమ్రోగింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తజనులు చినవెంకన్న ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఉదయం నుండే ఆలయంలో భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్నదానం వద్ద భక్తుల సందడి నెలకొంది. దాదాపు 15 వేల మంది వరకూ స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దర్శనానంతరం వారంతా వకుళమాత అన్న ప్రసాద భవనానికి చేరుకుని ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఎర్రకాలువ పటిష్టతకు
రూ.2.14 కోట్ల నిధులు



వరద నీటితో పొంగిపొర్లుతున్న ఎర్రకాలువ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దశాబ్ధ కాలంగా ఎర్రకాలువ రైతులు పడుతున్న సమస్యలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. తాజాగా ఎర్రకాలువ గండ్లు పూడిక, గట్లు పటిష్టత కోసం ప్రభుత్వం చొరవ చూపించి నిధులు విడుదల చేసింది. నిడదవోలు, గోపాలపురం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల పరిధిలో గండ్లు పూడిక, గట్లు పటిష్టతకు 9 పనుల నిమిత్తం రూ.2.14 కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించి త్వరలో పనులు పూర్తిచేయాలని రైతులకు వరద ఇబ్బంది తీర్చాలని భావిస్తోంది. ఈ నిధుల్లో అగ్రభాగం తాడేపల్లిగూడెం నియోజక వర్గం పరిధిలోని ఎర్రకాలువ పనులకు విడుదలయ్యాయి. ఈ అంశంపై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పలు మార్లు అసంబ్లీలో సమస్య ప్రస్తావించారు.

పనులకు నిధులు ఇలా..

ఎర్రకాలువ పనుల నిమిత్తం 2.14 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయగా ఆ పనులు వీరంపాలెం వద్ద గండి పూడిక నిమిత్తం రూ.37.90 లక్షలు, అప్పారావుపేట వద్ద గండి పూడిక కోసం రూ.31.70లక్షలు, వీరంపాలెం వద్ద గట్టు పటిష్టత కోసం రూ.20లక్షలు, రూ.15లక్షలు, మాధవరం వద్ద గండి పూడిక నిమిత్తం రూ.16లక్షలు, మరో చోట రూ.18 లక్షలు, నిడదవోలు మండలం కంసాలిపాలెం వద్ద గండి పూడిక నిమిత్తం రూ.30.60లక్షలు, నిడదవోలు మండలం కోరుమామిడి వద్ద గండి పూడిక నిమిత్తం రూ.15లక్షలు, నల్లజర్ల మండలం గుండేపల్లి వద్ద కాలువ లో పూడికతీత, గట్ల పటిష్టత కోసం రూ.30లక్షలు విడుదల చేశారు.





జంగారెడ్డిగూడెంలో స్కూల్ బస్సులను పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

స్కూల్ బస్సుల్లో అధికారుల తనిఖీలు

నాలుగు బస్సుల యాజమాన్యాలకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు విద్యార్థుల రక్షణ కోసం భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్కూల్ యాజమాన్యాలకు జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి ఆర్టీవో ఎస్ఎస్ రంగనాయకులు హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'ఫిట్‌లెస్ బస్సులు' కథనానికి రవాణా శాఖ అధికారుల తోపాటు పోలీసు శాఖ స్పందించింది. ప్రైవేట్ స్కూల్స్‌కు సంబంధించి బస్సులను తనిఖీలు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బస్సు డ్రైవర్‌లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఆయా స్కూల్స్ యాజమాన్యాలకు సూచనలు ఇచ్చామన్నారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నాలుగు బస్సులను గుర్తించి నోటీసులు ఇచ్చామన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబరు 4వ తేదీ వరకు ఫ్రెండ్లీ చెకింగ్‌లో భాగంగా అన్ని బస్సులను తనిఖీలు చేస్తామ న్నారు. ఏఎంవీఐ కేడీవీ రవిగోపాల్, సీహెచ్ సత్యనారాయణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

ఎనిమిది ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా ఎనిమిది ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్ నెంబర్ 08041 సికింద్రాబాద్ - అనకాపల్లి డిసెంబర్ 7, 14, 21, 28 తేదీలలో ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లుగా తెలిపారు. 07042 అనకాపల్లి - సికింద్రాబాద్ డిసెంబర్ 8, 15, 22, 29 తేదీలలో నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్ళు చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్లలో ఆగుతాయన్నారు. ఈ రైళ్ళల్లో ఫస్ట్‌క్లాస్ ఎసీ, సెకండ్ క్లాస్ ఎసీ, త్రి టైర్ ఎసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

రైళ్ల పొడిగింపు

రైల్ నెంబర్ 02863 సత్రగంజి - ఎలహంకకు డిసెంబర్ 4, 11, 18, 25 తేదీలలో (గురువారం) నాలుగు రైళ్ళను నడుపుతున్నారు. 02864 ఎలహంక - సత్రగంజికు డిసెంబర్ 6,13, 20, 27 తేదీలలో (శనివారం) మొత్తం నాలుగు రైళ్ళను నడుపుతున్నారు.

వన్‌స్టాప్ కేంద్రం తనిఖీ



వన్‌స్టాప్ సెంటర్‌లో రిజిష్టర్లను తనిఖీ చేస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కౌన్సెలింగ్ కోసం వన్‌స్టాప్ సెంటర్‌కు వచ్చే బాధితులకు న్యాయం అందించడానికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను కార్యదర్శి రత్న ప్రసాద్ శనివారం సందర్శించారు. ఈ వన్‌స్టాప్ కార్యాలయం రిజిష్టర్లను తనిఖీ చేశారు. బాధితులకు అందిస్తున్న సౌకర్యాలపైన అలాగే న్యాయ సహాయం పైన వివరణ అడిగి తెలుసుకున్నారు. వన్‌స్టాప్ సెంటర్ బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించి అవసరమైన పక్షంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సెంటరు అడ్మిన్ నిర్మల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అమ్మకాల్లో

'జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-2' ఫస్ట్

ముగిసిన వర్జీనియా పొగాకు అమ్మకాలు

ఎంపీ పుట్టా మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన రైతులు

జంగారెడ్డిగూడెం, నవంబరు29(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం-2లో వర్జీనియా పొగాకు అమ్మకాలు శనివారంతో ముగిశాయి. ఎస్ఎల్ఎస్ పరిధిలో ఉన్న ఐదు పొగాకు వేలం కేంద్రాల కంటే ఎక్కువ రోజులు అంటే 200 రోజుల పాటు వేలం నిర్వహణ జరిగింది. ఎక్కువ పొగాకు అమ్మకాలు ఈవేలం కేంద్రంలోనే జరగడంతోపాటు రూ.576 కోట్ల పొగాకు అమ్మకాలు జరిపి ఎస్ఎల్ఎస్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో గురువారంతో వేలం ముగియగా రూ.555 కోట్ల పొగాకు అమ్మకాలు జరిగాయి. ఎస్ఎల్ఎస్ పరిధిలోని రాజమండ్రి రీజియన్‌లోని జంగారెడ్డిగూడెంలో రెండు వేలం కేంద్రాలు, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం పరిధిలో 12,879 మంది రైతులు ఉండగా 14,994 లైసెన్స్‌డ్ బ్యారన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 26,336.64 హెక్టార్లలో పొగాకు పండించారు. 2024-25 పంట కాలానికి 62.11 మిలియన్ కిలోల పొగాకు పండించడానికి పొగాకు బోర్డు ప్రభుత్వం అనుమతినివ్వగా రైతులు 83.88 మిలియన్ కిలోల పొగాకు పండించారు. రీజియన్ పరిధిలో 21.77 మిలియన్ల పొగాకు అదనంగా పండించారు.

ఏలూరు ఎంపీ సహకారంతో అదనపు అమ్మకాలు

గత రెండేళ్లగా ఎస్ఎల్ఎస్ పరిధిలో ఉన్న పొగాకు రైతులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ అందిస్తున్న సహకారం మరువలేనిదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు అదనంగా పండించిన పొగాకుకు గత ఏడాది ఎటువంటి అపరాధ రుసుము విధించకుండా పొగాకు బోర్డు ద్వారా అమ్ముకునేలా కేంద్ర ప్రభుత్వంతోనూ, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తోనూ మాట్లాడి రైతులకు ఎంతోమేలు చేశారు. ఈ ఏడాది కూడా రైతులకు స్వల్ప అపరాధ రుసుముతో అదనంగా పండించిన పొగాకు అమ్ముకునేలా సహకరించారు. ఇటువంటి సహకారం గతంలో ఎన్నడూ జరగలేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి కంటే అదనంగా రైతులు పండించిన పొగాకు అమ్మకాల వల్లే దాదాపు ఏడు నెలల పాటు వేలం నిర్వహణ జరిగింది.

డిసెంబరు 2 నుంచి చూర పొగాకు అమ్మకాలు

200 రోజుల పాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వేలం ప్రక్రియ జరగడానికి సహకరించిన రైతులు, బయ్యర్లకు జంగారెడ్డిగూడెం పొగాకు వేలం నిర్వహణాధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్రకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబరు 2 నుంచి చూర పొగాకు అమ్మకాలు జరుగుతాయని రైతులకు తెలిపారు.



పొగాకు వేలం కేంద్రంలో వేలం తీరును పరిశీలిస్తున్న ఎంపీ మహేశ్(ఫైల్)



జంగారెడ్డిగూడెంలో వేలం నిర్వహిస్తున్న వ్యాపార సంస్థల ప్రతినిధులు

వేలం కేంద్రాల్లో అమ్మకాలు ఇలా..

- జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో 12.6 మిలియన్ కిలోల పొగాకుకు బోర్డు అనుమతి ఇవ్వగా అదనంగా పండించిన 5.93 మిలియన్ కిలోల పొగాకుతో పాటు 18.57 మిలియన్ కిలోల పొగాకు అమ్ముడైంది. సరాసరి ధర రూ.299.06 కాగా గరిష్ట ధర రూ.456, కనిష్ఠ ధర రూ.50. 198 రోజులు వేలం నిర్వహణ జరిగింది.
- జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-2లో 13.37 మిలియన్ కిలోల పొగాకుకు బోర్డు అనుమతి ఇవ్వగా అదనంగా పండించిన 5.81 మిలియన్ కిలోల పొగాకుతో పాటు 19.18 మిలియన్ కిలోల పొగాకు అమ్ముడైంది. సరాసరి ధర రూ. 300.66 కాగా గరిష్ట ధర రూ.456, కనిష్ఠ ధర రూ.50. 200 రోజులు వేలం నిర్వహణ జరిగింది.
- కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 12.62 మిలియన్ కిలోల పొగాకుకు బోర్డు అనుమతి ఇవ్వగా అదనంగా పండించిన 5.26 మిలియన్ కిలోల పొగాకుతో పాటు 17.88 మిలియన్ కిలోల పొగాకు అమ్ముడైంది. సరాసరి ధర రూ.296.60. గరిష్ఠ ధర రూ.456, కనిష్ఠ ధర రూ.48. 193 రోజులు వేలం.
- దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో 11.51 మిలియన్ల పొగాకుకు బోర్డు అనుమతి ఇవ్వగా రైతులు అదనంగా పండించిన పొగాకు 1.67 మిలియన్ కిలోల పొగాకుతో పాటు 13.8 మిలియన్ కిలోల పొగాకు అమ్ముడైంది. ఈ కేంద్రంలో సరాసరి ధర రూ.292.96 కాగా గరిష్ఠ ధర రూ.455, కనిష్ఠ ధర రూ.50గా ఉంది. 175 రోజులు వేలం.
- గోపాలపురం వేలం కేంద్రంలో 11.97 మిలియన్ కిలోల పొగాకుకు బోర్డు అనుమతి ఇవ్వగా అదనంగా పండించిన 3.01 మిలియన్ కిలోల పొగాకుతో పాటు 15.07 మిలియన్ కిలోల పొగాకు అమ్ముడైంది. సరాసరి ధర రూ.296.57. గరిష్ఠ ధర రూ.455, కనిష్ఠ ధర రూ.49. 186 రోజులు వేలం జరిగింది.

రేపటి నుంచి పులుల గణన

కుక్కునూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు అటవీ రేంజ్ పరిధిలో డిసెంబరు ఒకటి నుంచి పులుల గణనకు సంబంధించి సర్వే నిర్వహిస్తామని ఏలూరు జిల్లా అటవీ శాఖ అధికారులచే ఓ ప్రకటన వెలువడింది. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ కోసం ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ డిసెంబరు ఒకటి నుంచి పులుల గణనకు సన్నద్ధమవుతుంది. ఏలూరు అటవీ విభాగంలోని పాపికొండల నేషనల్ పార్క్, నార్త్ ఇన్‌స్టాన్ ఘాట్ పులుల సంరక్షణకు ప్రధానకేంద్రంగా ఉండడంతోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల పులుల నివాసాన్ని కలిపే ముఖ్యమైన క్యారిడార్‌గా పని చేస్తుంది. గత కొన్నేళ్లగా ఏలూరు విభాగంలోని పాపికొండల నేషనల్ పార్కు ప్రాంతంలో ఉన్న ఉండతపల్లి, కొవ్వాడ, గెడ్డపల్లి, పరిసరాల్లో పులుల సంచారం గుర్తించబడింది. పాపికొండల అభయారణ్యంలో పులులు ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు. ఈ ప్రాంతం కుక్కునూరు అటవీ రేంజ్ పరిధిలో కొంత భాగం ఉండడంతో పులుల గణన జరగనున్నట్లు స్థానిక అటవీ సిబ్బంది తెలిపారు.

కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని నిరుద్యోగ యువతకు కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్థానిక డీఎల్‌టీసీ ప్రధానా చార్యుడు డి.భూషణం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన కింద ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్, పెరిఫెరల్స్ (కంప్యూటర్ హార్డ్‌వేర్) కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్ లేక అంతకంటే ఎక్కువ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఈనెల 30వ తేదీ నాటికి దరఖాస్తులు అందించాలని, వివరాలకు 949348 27414 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆహా.. వియ్యపురాలి జీళ్లు

షష్టి ఉత్సవాల్లో నోరూరించే జీళ్ల తయారీ

ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వియ్యపురాలి జీళ్లంటే ఓ విశిష్టత. సంప్రదాయంగా చూస్తే ఈ జీళ్లకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. పూర్వం వివాహం జరిగిన అనంతరం కుమార్తెను అత్త వారింటికి కొత్తగా కాపురానికి పంపే సమయంలో సారెతోపాటు వియ్యపురాలి నోరు తీపి చేసేందుకు ఉభయ గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా జీళ్లను పంపించడం సంప్రదాయం. రానురాను గోదావరి జిల్లాల జీడీల ఆచారం కృష్ణా జిల్లాకు వ్యాపారంగా తరలివచ్చింది. ఉత్సవాల సమయంలో దేవస్థానాల వద్ద వియ్యపురాలి జీళ్ల వ్యాపారం జోరుగా సాగడం ఆనవాయితీగా మారింది.

ఉత్సవాల్లో జీళ్లదే హవా!

ముదినేపల్లి మండలం సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఏటా ఒకసారి జరిగే సుబ్రహ్మణ్య షష్టి కల్యాణోత్సవాల్లో వియ్యపురాలి జీళ్లదే వ్యాపార హవా సాగుతుంది. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులు ఈ జీళ్లను కొనుగోలు చేస్తారు. కళ్లెదుటే వ్యాపారులు అరగంటలో తాజాగా జీడీలను తయారు చేసి అమ్ముతారు. వీటి తయారీ ప్రక్రియ బెల్లం ముక్కలను పాకం చేసి, పాకాన్ని సాగదీసి, గట్టి కడ్డీలుగా తయారు చేసి జీడీలుగా నరకడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ జీళ్ల తయారీకి ముడి సరుకు బెల్లం మాత్రమే రెండో పదార్థం ఉండదు. నిపుణులైన పనివాళ్లు మాత్రమే అవసరం. కేజీ జీళ్లను రూ.175 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు.



బెల్లపు పాకాన్ని కడ్డీగా తయారు చేస్తున్న వ్యాపారి



జీళ్లు, పాకం పడుతున్న బెల్లపు ముక్కలు





బెల్లపు పాకం కడ్డీ నుంచి జీడి ముక్కల చేస్తున్న దృశ్యం

సంప్రదాయమే వృత్తిగా మారింది

గోదావరి జిల్లాలో పెళ్ళిళ్ల సమయాల్లో పూర్వీకుల నాడు వియ్యపురాలి జీళ్ల ఆచార సంప్రదాయం కోసం తయారు చేసి అమ్మేవారు. అది మా తరానికి వ్యాపారంగా మారింది. పెట్టుబడి పెరిగి ప్రస్తుతపరిస్థితుల్లో ఈ వ్యాపారం లాభసాటిగా లేకున్నా పూర్వీకుల సంప్రదాయం కొనసాగిస్తున్నాం.



- నాగరాజు, జీళ్ల తయారీదారు, అమలాపురం

డిజిటల్ అరెస్టు పేరుతో వల

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



సీఐ కాళీచరణ్‌ను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భీమవరం రెండవ పట్టణంలో ఒక రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ సైబర్ క్రైం ముఠాకు డిజిటల్ అరెస్ట్, కాజ్ డీల్ పద్ధతిలో వారికి లొంగిపోయి రూ.78.60 లక్షలు నాలుగు బ్యాంకుల నుంచి వారికి ఆర్టీజీఎస్ చేసి మోసపోయాడు. దీంతో బాధితుడు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసిన సీఐ కాళీచరణ్ చాకచక్యంగా వ్యవహరించారు. ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. కంబోడియా దేశం నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వ్యక్తులకు లావాదేవీలు జరుగుతున్నట్లుగా గుర్తించి అందులో ఒక వ్యక్తిని సీఐ కాళీచరణ్ సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. అనంతపురం జిల్లాలో బ్యాంకు నుంచి విత్‌డ్రా చేయడానికి వచ్చిన వ్యక్తిని సీసీ కెమెరాలో గుర్తించి అరెస్టు చేశారు. ఆ వ్యక్తిని పట్టుకుని మొత్తం కూపీ లాగారు. దీంతో అతను చెప్పిన నిజాలు విని ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే ముఠాలోని సభ్యులను ఒక్కొక్కరిగా అదుపులోకి తీసుకున్నారు. 13 మందిని అరెస్టు చేయగా అసలైన నిందితుడు ముంబాయ్‌కు చెందిన రహతేజే నయన్ మాత్రం పరారయ్యాడు. నిందితులంతా అనంతపురం, హైదరాబాద్, ఖమ్మం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన వారు. అయితే వీరు పోలీసులకు పట్టుబడకుండా ఉంటే మరిన్ని డిజిటల్ అరెస్ట్‌లు అంటూ అమాయకుల వద్ద డబ్బులు దోచుకునేవారని చెబుతున్నారు. ఈ కేసును ఎంతో తెలివిగా ఛేదించిన కాళీచరణ్‌ను, టీమ్ సభ్యులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఎక్స్ వేదికగా అభినందించారు. ఎంతో సమయస్ఫూర్తి ఉన్న సీఐ కాళీచరణ్ మరిన్ని కేసులను ఛేదించి ఉన్నత స్థానాలకు వెళ్ళాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

స్నేహితుడి హత్య

తణుకు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఒక యువకుడి హత్యకు గురైన సంఘటన తణుకు రూరల్ మండలం పైడిపర్రులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పైడిపర్రులోని గౌతమీ సాల్వెంట్ ఎదురుగా వున్న డ్రైవర్ కాలనీకి చెందిన శిరాళం ప్రభాకర్ (28), కందుల శ్రీను స్నేహితులు. అయితే ఇటీవల ఈ ఇద్దరికి మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో కందుల శ్రీనుపై ప్రభాకర్ దాడి చేసి గాయపర్చాడు. దీనిని అవమానకరంగా భావించిన కందుల శ్రీను, తన మరో స్నేహితుడుతో కలసి ప్రభాకర్‌ను హత్య చేసేందుకు ప్రణాళిక రచించాడు. దీనిలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి దాటాక శ్రీను, అతని స్నేహితుడు కాపకాయల గణేష్‌లు కలసి ప్రభాకర్ ఇంటికి వచ్చి కత్తితో దాడి చేశారు. ఈ సంఘటనలో ప్రభాకర్‌ను గణేష్ పట్టుకోగా శ్రీను కత్తితో పలు మార్లు ప్రభాకర్‌ను పొడిచినట్లు తెలిపారు. గాయపడిన ప్రభాకర్‌ను 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రభాకర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు తెలిపారు. ఈసంఘటనపై మృతుని తల్లి చిన్నారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువురి మధ్య వివాదం

పెదవేగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సమీపంలో నివసించే ఇరువురి మధ్య జరిగిన కొట్లాటలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. పెదవేగి మండలం నడిపల్లికి చెందిన దొండపాటి మహేష్ కవ్వగుంటలో మందుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆ దుకాణానికి సమీపంలో నివసిస్తున్న కవ్వగుంటకు చెందిన మర్రి అనిల్‌కుమార్ ఇంటిలోకి తరచుగా తొంగిచూస్తున్నాడు. శుక్రవారం రాత్రి కూడా ఇలాగే చూస్తుండగా గమనించిన అనిల్‌కుమార్ రోజూ చాటుగా ఎందుకు చూస్తున్నావంటూ మహేష్‌ను ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి, కొట్లాటకు దారి తీసింది. దీంతో అనిల్‌కుమార్ కత్తితో మహేష్‌పై విచక్షణారహితంగా దాడిచేశాడు. మహేష్‌కూడా అనిల్‌పై దాడిచేశాడు. ఈ దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఇరువురిపై పరస్పరం కేసులు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జైలులో ఖైదీలకు ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులపై వైద్యులు నాగేశ్వరరావు, నాగేశ్వరి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా జైల్ పర్యవేక్షణాధికారి డి.నరసింహారెడ్డి మాట్లాడుతూ ఖైదీలకు అవసరమైన సహాయం అందిస్తున్నామని, వారిలో సరైన మార్పుకు కృషి చేస్తున్నామన్నారు. క్లబ్ అధ్యక్షులు బీవీవీ సత్యనారాయణ, లయన్స్ జిల్లా నాయకులు ఎల్ వెంకటేశ్వరరావు, సీనియర్ అడ్వకేట్ కూన కృష్ణారావు, జైలర్స్ వి.రమేష్, కె.శ్రీనివాసరావు, డిప్యూటీ జైలర్ కేవీ వసంతరావు పాల్గొన్నారు.

రెండు మోటారు సైకిళ్లు ఢీ - ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెళుతున్న మోటారు సైకిల్‌ను మరో మోటారు సైకిల్ ఢీ కొనడంతో ఇద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. భీమడోలులోని వెలమపేటకు చెందిన మొయ్యే వెంకట రమణ (42) తమ మోటారు సైకిల్‌పై శనివారం మధ్యాహ్నం వెళ్తుండగా భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన సిద్దాబత్తుల కార్తీక్ (23) మోటారు సైకిల్‌పై వచ్చి వెంకట రమణను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలకు గురి కాగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేర్పించారు. వెంకట రమణ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఊరు వెళ్లి వచ్చే సరికి చోరీ

వెండి, బంగారపు వస్తువుల అపహరణ

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి ఊరువెళ్ళేటప్పటికి దొంగలు ఆ ఇంటి తలుపులు పగలగొట్టి ఆ ఇంట్లో నిబీరువాను పగులగొట్టి వెండి, బంగారపు వస్తువులను అపహరించుకుపోయారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం ద్వారకానగర్‌లో శొంఠి వెంకట సుబ్రహ్మణ్యం తన కుటుంబంతో ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం విజయవాడలోని బంధువుల ఇంటికి కుటుంబంతో సహా వెళ్ళారు. ఇంటికి తాళాలు వేశారు. ఆ ఇంటికి సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. ఈనెల 28వ తేదీ రాత్రి తన ఫోనుకు సీసీ కెమెరాల కనెక్షన్ ఉండడంతో చూడగా కెమెరాలు పక్కకు తిప్పివేసి ఉన్నాయి. దీంతో ఆయన వచ్చి చూసేటప్పటికి తలుపులు పలగొట్టి ఉంది. బీరువా కూడా పగులగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులు కూడా చెల్లాచెదరుగా పడవేసి ఉన్నాయి. బీరువాలోని పావుకేజీ వెండి వస్తువులు, మూడున్నర కాసుల బంగారపు వస్తువులు అపహరణకు గురైనట్లుగా గుర్తించి శనివారం ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామానికి చెందిన చుక్కా కార్తీక్ (21) వెల్డింగ్ పనులు చేస్తూ ఉంటాడు. జంగారెడ్డిగూడెం వైపు నుంచి ఏలూరునకు శనివారం సాయంత్రం మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో దెందులూరు మండలం సోమవరప్పాడు గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోవడంతో అతను తీవ్ర గాయాలకు గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. అటుగా వెళ్తున్న వారు 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉందని తెలిపారు.

టిప్పర్ లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ప్రవేశించిన ఒక టిప్పర్‌లారీ అతి వేగంగా వెళ్తూ ఒక మోటారు సైకిల్‌ను ఢీ కొనడంతో ఆ మోటారు సైకిల్‌పై ఉన్న ఇద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఏలూరులోని తంగెళ్ళమూడి గవరపేటకు చెందిన దాడి నవీన్ (22) ఏలూరు దక్షిణపు వీధినకు చెందిన ధనుమా రెడ్డి సందీప్ (21)లు కలిసి మోటారు సైకిల్‌పై ఏలూరులోని కైకలూరు బైపాస్‌రోడ్డు వెంకన్న చెరువు వద్ద వంగాయిగూడెం వైపు శనివారం సాయంత్రం వెళ్తున్నారు. మాదేపల్లి నుంచి అతి వేగంగా వచ్చిన ఒక ట్రిప్పర్‌లారీ అతి వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలకు గురికాగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

స్వదేశానికి అభయ్ పార్థీవదేహం

జంగారెడ్డిగూడెం,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన అమెరికా లో గుండెపోటుతో మృతి చెందిన పట్టణానికి చెందిన పట్నాల అభయ్ (32) పార్థీవదేహం శనివారం పట్టణానికి చేరుకుంది. అమెరికాలో అన్ని అనుమతులు తీసుకున్న తరువాత ఈనెల 27న అభయ్ పార్థీవదేహాన్ని కార్గో విమానం ద్వారా పంపగా శనివారం హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అక్కడి నుంచి అంబులెన్సులో జంగారెడ్డిగూడెం తీసు కువచ్చి అంత్యక్రియలు జరిపినట్లు మృతుని తండ్రి పట్నాల సోమశేఖర్ తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు, సోదరుడు రాహుల్,బంధువులు అభయ్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

రేపు గంగానమ్మ జాతర విశిష్టతపై ప్రసంగం

ఏలూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐఎంహెచ్‌ఏ ప్రాంగణంలో ఏలూరులో పలు ప్రాంతాలలో నిర్వహిస్తున్న అమ్మవారి జాతరకు సంబంధించి ప్రజలు పాటించాల్సిన నియమాలు, జాతరను ఎలా జరుపుకోవాలనే విశేషాలపై సోమవారం ప్రసంగం ఉంటుందని వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ తెలిపింది. కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.సత్యనారాయణ, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులు యిరదల ముద్దుకృష్ణ, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావులు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):గడియార స్తంభం వద్ద ఉన్న ది ఏలూరు జ్యుయలర్స్ అండ్ బులియన్ మర్చంట్స్ హాల్లో ఆదివారం ఉచిత గుండె వ్యాధుల పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షులు తడికమళ్ళ శివ సత్యనారాయణ, జ్యుయలర్స్ మర్చంట్స్ అసోసియేషన్ కోశాధికారి కనిగొళ్ళ బాస్కర మణికంఠలు తెలిపారు. ఈ శిబిరంలో స్థానిక సిరి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు ఎ.ప్రసన్నకుమార్ బృందం ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

టి.నరసాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని టి.నరసాపురం సొసైటీ చైర్ పర్సన్ జోనుబోయిన సోంబాబు అన్నారు. మండల కేంద్రమైన టి.నరసాపురం సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ గొడౌన్‌లో రైతు సేవా కేంద్రం ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సొసైటీ చైర్మన్ జోనుబోయిన సోంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. సొసైటీ పర్సన్ మెంబర్లు మోదుగు రామారావు, ఉయ్యూరు నాగమణి, రాచబంటు వేములయ్య, కొనకల్ల మోహన్, పెద్దిన సత్యనారాయణ, అద్దంకి జగ్గారావు, భైగాని వెంకటేశ్వరరావు, దొప్పసాని గోవర్ధన్, కిలారి సాంబశివరావు, రాజు, కొల్లి రమేష్, మురళి సిబ్బంది పాల్గొన్నారు.

వట్లూరులో ఘనంగా అన్నదాత సుఖీభవ

పెదపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి పొందిన పెదపాడు మండలం వట్లూరులోని రైతులకు సీఎం పంపిన లేఖలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అందజేశారు.ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించడమే కాకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి గంటల వ్యవధిలోనే వారి ఖాతాలో సొమ్ము జమ చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఇంటి స్థలం అవసరమున్న లబ్ధిదారులను గుర్తించి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాల పందిరి రాట ఏర్పాటు

దెందులూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గాలాయగూడెంలో కొలువైన అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు పందిరిరాట ఏర్పాటు శనివారం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సంప్రదాయ బద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి ఉత్సవ పనుల ప్రారంభ పందిరి రాటను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఉత్సవాలు విజయవంతం కావాలని కోరుతూ పూజలు నిర్వహించారు. గాలాయగూడెం ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరికి సన్మానం

పోలవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలో జరిగిన ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అవగాహన కార్యక్రమంలో శనివారం ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొవ్వాసు జగదీశ్వరిని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేషనల్ జనరల్ సెక్రటరీ హేమా ఎక్కా శాలువా కప్పి సన్మానించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి, నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుబీర్ పాల్, సౌత్ ఇండియా కో ఆర్డినేటర్ ఆదినారాయణ, జనరల్ సెక్రటరీ బి.విజయ్ నాయక్ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో కొత్త వైద్యుల నియామకం

చింతలపూడి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి గత కొద్ది రోజులుగా ఎనిమిది మంది కొత్త డాక్టర్లు జాయిన్‌కావడంతో ఆసుపత్రిలో ఓపీ సంఖ్య పెరిగింది. శనివారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వచ్చే పేషెంట్లకు మరిన్ని సౌకర్యాలు కల్పించేలా డాక్టర్లు, సిబ్బంది సహకరించాలని కోండ్రు దేవ సూచించారు. ఆసుపత్రిలో 23 మంది డాక్టర్లకు ఎనిమిది మందే ఉన్నారు. గత నెల రోజుల నుంచి కొత్తగా 8 మంది రావడంతో కొంత వెసులుబాటు కలిగింది. కొత్తగా వచ్చిన డాక్టర్లలో గైనకాలజీ, అనస్తీషియా, పెడియాట్రిక్స్, డిప్యూటీ సివిల్ సర్జన్, పాదాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, రేడియాలజీలు రాకతో రోగుల సంఖ్య పెరిగింది. కొద్ది రోజుల్లో మరో ఏడుగురు డాక్టర్లు వస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి త్వరగా పూర్తయితే అన్ని సౌకర్యాలు కలుగుతాయన్నారు. ఈ ఏరియాలోని పేదలకు మంచి వైద్యం అందించే వీలుంటుంది. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.నారాయణరావు, డాక్టర్లు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఏలూరుసిటీ/రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై హౌసింగ్ కార్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు. అనంతరం హౌసింగ్ కార్యాలయం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏలూరు అమీనాపేటలోని అటవీశాఖ, వన్యప్రాణి యాజమాన్య విభాగము డివిజన్ కార్యాలయములో డివిజనల్ అటవీశాఖ అధికారి బి.విజయ, అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏలూరు రూరల్ మండలం గొల్లాయిగూడెం సెంటర్లో శనివారం సమాచారహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ గాయత్రి ఆధ్వర్యంలో వంగాయగూడెం మీదుగా జూట్ మిల్లు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై శాస్త్రవేత్తల అవగాహన

పోలవరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): విత్తన శుద్ధితో సమగ్ర సస్యరక్షణతో మొక్కజొన్నలో అధిక దిగుబడి సాధించవచ్చని కేంద్రియ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.విజయలక్ష్మి అన్నారు. శనివరం పోలవరం మండలం కోండ్రుకోట పునరావాస కాలనీలో ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రైతు అవగాహన కార్యక్రమంలో విత్తన శుద్ధి గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రేఖ, పశువైద్య నిపుణులు ఎడేవీ వర్రప్రసాద్ రెడ్డి పెరటి కోళ్ల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్, ఎం ఫిలోమాన్, మేదేబొత్త ముక్కయ్య, వెట్టి కన్నయ్య, తామా రామరాజు, వెట్టి నాగేశ్వరరావు, సింహాచలం, గంగు రామలక్ష్మి దేవి, మూలెం కుమారి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం : చింతమనేని

పెదవేగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇల్లులేని కుటుంబం అనేది ఉండకూడదని, దీనికోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గృహ నిర్మాణశాఖాధికారులతో పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపిక, స్థలాల సేకరణ వంటి అంశాలపై ఆయన చర్చించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందన్నారు. ఎవ్వరైనా అనర్హులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ డీఈ వివేకానంద, తహసీల్దార్లు భ్రమరాంబ, సుమతి, విజయ కుమార్‌రాజు, ఎంపీడీవోలు నాగేంద్ర కుమార్, జనార్ధన్, టీడీపీ నాయకులు ఈడ్పుగంటి అనిల్, బొప్పన సుధాకర్, మంచినేని శ్రీనివాసరావు, తాతా సత్యనారాయణ, గారపాటి కొండయ్య చౌదరి, కొనకళ్ల శివమణి, నంబూరి నాగరాజు, ఎం.రవి పాల్గొన్నారు.

యూటీఎఫ్ నగర శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నగర శాఖ నూతన కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో సంఘ అధ్యక్షుడిగా సీహెచ్.షణ్ముఖి, ప్రధానకార్యదర్శిగా జె.రాజారావు, కోశాధికారిగా కెకిరణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.చిట్టిబాబు, సహ అధ్యక్షులుగా కె.దొరబాబు, ఆర్.రాజేశ్వరి, కార్యదర్శులుగా వరప్రసాద్, మారుతి, మహంకాళి, విజయలక్ష్మి, రామచంద్రరావు, శ్రీనివాసరావు, సాదిక్, లక్ష్మీదుర్గలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.రవికుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సంఘ తొలిసమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘ నూతనకార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల పరిశీలకుడిగా శివశంకరరావు వ్యవహరించారు. సంఘ జిల్లా నాయకులు షేక్ పర్వీన్ బేగం, జిక్రియ, అప్పారావు, వరప్రసాద్, చిట్టిబాబు, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

సారొస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధికి మరోక కీలక మైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు వేముల సుధీర్, చింతల వాసు, కడియాల రవి శంక ర్, నల్లా ఆనంద్ పాల్గొన్నారు.

సీఎం మీటింగ్‌కు ట్రాఫిక్ నియంత్రణ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చేబ్రోలు రైల్వే గేటు నుంచి దూబచర్ల, దూబచర్ల నుంచి చేబ్రోలు మార్గంలో ప్రయాణించే భారీ వాహనాలు, గూడ్స్ వెహికల్స్ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాల్సి ఉంది. సాధారణ పౌరులు, ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సులు యథావిధిగా కొనసాగుతాయని నిడమర్రు సీఐ రజనీకుమార్, చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల ఆటల పోటీలు

పెదవేగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని పెదవేగి ఎంఈవో -2 వి.అరుణ్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల క్రీడాపోటీలు పెదవేగి మండలం విజయరాయిలో శనివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను ప్రారంభించిన ఎంఈవో -2 అరుణ్ కుమార్ మాట్లాడుతూ నిత్యం బోధనతో ఉండే ఉపాధ్యాయులకు ఈ పోటీలు ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. ఉపాధ్యాయుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఉపాధ్యాయులంతా ఈ పోటీల్లో పాల్గొని, రాష్ట్ర స్థాయిలో ఎంపికవ్వాలని ఆయన సూచించారు. శ్రీనివాస్, రమేష్, రమణ, నాగార్జున పాల్గొన్నారు.

సింగగూడెంలో ఉపాధ్యాయుల ఆటవిడుపు..

లింగపాలెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం సింగగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు కె.వి.దుర్గారావు, జె.రవీంద్రల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలతో ఉపాధ్యాయులకు ఆటవిడుపుతో పాటు మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు మండల స్థాయి షటిల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. శనివారం జరిగిన ఈ ఆటల పోటీల్లో మండల స్థాయిలో విజేతలుగా నిలిచి ఉత్తమ ప్రతిభ కనపరచిన 28 మంది ఉపాధ్యాయులను డివిజనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈవో దుర్గారావు తెలిపారు.



దెందులూరులో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



సింగగూడెంలో క్రికెట్ ఆడుతున్న ఉపాధ్యాయులు

క్రీడలతో క్రమశిక్షణ పెంపొందుతుంది

బుట్టాయగూడెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ అన్నారు. మండల స్థాయిలో నిర్వహించే ఉపాధ్యాయుల ఎంపిక క్రీడా పోటీల(క్రికెట్)ను శనివారం పీవో ఐటీడీఏ వద్ద ఆటస్థలంలో ప్రారంభించారు. ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. స్వయంగా పోటీల్లో పాల్గొని పీవో క్రికెట్ ఆడారు. అధికారులు రవి ప్రసన్నకుమార్, శిరమయ్య, నరేంద్రరాయ్ పాల్గొన్నారు.

క్రీడలకు ఉపాధ్యాయుల ఎంపిక

దెందులూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీల ఎంపిక కార్యక్రమం దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. శనివారం దెందులూరు మండల విద్యాశాఖాధికారి భాస్కర్ కుమార్, హెచ్ఎం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలను సర్పంచ్ తోట యేసమ్మ, ఎంపీటీసీ శేషారత్నంలు క్రికెట్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి త్రోబాల్ టీంకు 12 మంది, ఉపాధ్యాయ క్రికెట్ పోటీకి 16 మంది ఎంపిక చేసినట్టు మండల విద్యాశాఖాధికారి ప్రసాద్ అన్నారు. టీడీపీ నేతలు యిప్పిలి వెంకటేశ్వరరావు, పెనుబోయిన మహేష్‌యాదవ్, సంపంగ తిలక్, విద్యా కమిటీ చైర్మన్ బొత్స కనక కిషోర్ ఉన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మంత్రితో నాయకులు

ఏలూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా కృషి చేయాలని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరుతూ ఏపీ ఎంఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చాటపర్తి పోసిబాబు కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి వినతిపత్రం అందజేశారు. పోసిబాబు మాట్లాడుతూ మిగతా రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో ఉన్నారని తెలిపారు.ఇచ్చిన హామీ మేరకు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తులసిపాటి కృష్ణం రాజు, గంగేటి సంధ్యారాణి, బండారు వెంకట ధర్మారావు, దేవరకొండ రమాదేవి ఉన్నారు.

ఎల్‌టీఆర్ భూముల్లో జోక్యం తగదు

బుట్టాయగూడెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎల్.టి.ఆర్., 1/70చట్టం భూముల్లో పోలీసుల జోక్యం సరైందికాదని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అన్నారు. భూ వివాదాల్లో పోలీసుల జోక్యాన్ని నిరసిస్తూ శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మండల నాయకులు ఆందోళన చేపట్టారు. అమ్మపాలెం, గుంజవరం, చీమలవారిగూడెం గ్రామాల్లోన ఎల్.టి.ఆర్ భూముల్లో ఆదివాసీలకు గిరిజనేతరులకు 11.46 ఎకరాల భూమిలో భూవివాదం ఉందన్నారు. ఈ భూముల విషయంలో పోలీసుల జోక్యం సరికాదన్నారు.తమను స్టేషన్‌కు రావాలని, రికార్డులు చూపాలని చెప్పడం సరికాదన్నారు. సివిల్ భూవివాదాల్లో జోక్యం చేసుకుని ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తూ గిరిజన చట్టాలను కాలరాస్తున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ పివి చలపతిరావుకు నాయకులు ముత్యాలమ్మ, నాగేశ్వరరావు, వీరయ్య, ముత్యాలరావు, గంగరాజు, వెంకటస్వామి, దుర్గారావు, రామిరెడ్డి ఆదివాసీలు వినతిపత్రం అందజేశారు.



పల్లె నిద్రలో పాల్గొన్న పోలీస్ అధికారులు

వెంకటాపురంలో పోలీసుల పల్లెనిద్ర

చింతలపూడి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలు ఘర్షణ లేకుండా సామరస్యంగా జీవితాన్ని గడపాలని చింతలపూడి సీఐ క్రాంతికుమార్ అవగాహన కల్పించారు. శుక్రవారం రాత్రి మండలంలోని వెంకటాపురంలో పోలీసులు పల్లెనిద్ర నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో గ్రామస్థాయిలో ఉన్న సమస్యలు తెలిపారు. మాదకద్రవ్యాలు, సారా విక్రయాలు చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా సక్రమంగా నడుచుకోవాలన్నారు. అనంతరం ఎస్ఐ సతీష్ కుమార్ గ్రామస్థులకు మరికొన్ని సూచనలిచ్చారు.

బంకు స్కాంపై దర్యాప్తు జరపాలి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో జరిగిన 83 లక్షల స్కాంపై జ్యుడీషియల్ దర్యాప్తు జరిపి దోషులను గుర్తించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసడాంగే డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షా శిబిరానికి శనివారం ఏఐటీయూసీ బృందం సంఘీభావం తెలిపింది. నాలుగేళ్లుగా బంకు నిర్వహణలో జరుగుతున్న లోపాలను గుర్తించడంలో యాజమాన్యం విఫలమైందని డాంగే పేర్కొన్నారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, వై.శ్రీనివాస్, పి.కె.రావు పాల్గొన్నారు. శనివారం దీక్షలో టి.ఎస్.కె.బాబు, వి.ఆంజనేయులు, వి.ఎస్.వి.ప్రసాద్, వి.వి.రెడ్డి, ఐ.హెచ్.రావు, ఎ.ఎస్.రావు, టి.డి.చారీ పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు

ద్వారకాతిరుమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్ర ప్రధాన ఆలయానికి ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి.ఉదయం ఆలయంలో మూల విరాట్‌కు అర్చకులు క్షీరాభిషేకాన్ని జరిపారు. సాయంత్రం శ్రీపుష్ప యాగోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి పూజలు చేశారు.

వినూత్న ప్రయోగాలు చేయాలి

పెదపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ మారుతున్న పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావాలని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎండీ కె.సాయిరోహిత్ తెలిపారు. వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్.ఐ.ఆర్.ఎఫ్ ర్యాంకింగ్ ద్వారా సంస్థల శక్తివంతం అనే అంశంపై ఆఫ్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఉన్నత విద్యారంగంలో వేగంగా మారుతున్న మార్పుల మధ్య సంస్థ నాణ్యత, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అధ్యాపకులకు సూచనలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.మురళీధరరావు, డీన్ అకడమిక్ డాక్టర్ శర్మ, ఇంటర్నల్ అఫైర్ డాక్టరు ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

చిన్నారుల సంక్షేమమే లక్ష్యం

పెదవేగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలని పెదపాడు ఇన్‌చార్జ్ సీడీపీవో ఫాతిమా బేగం అన్నారు. పెదవేగిలో శనివారం జరిగిన అంగన్‌వాడీ పెదవేగి సెక్టార్ సమావేశంలో చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్యకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రతను పాటించాలన్నారు.నిర్దేశించిన విధానంలో చిన్నారులకు ఆహారం అందించాలని సీడీపీవో ఫాతిమా బేగం తెలిపారు. పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సచివాలయం ప్రారంభిస్తున్న నాయకులు

జీలకర్రగూడెంలో సచివాలయం ప్రారంభం

కామవరపుకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, స్థానికులు సంయుక్తంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, అర్చనలు జరిపారు. రాజకీయాలకతీతంగా టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ తదితర పార్టీలకు చెందిన నాయకులు, ప్రతినిధులు హాజరుకావడం విశేషం.. సర్పంచ్ గోరింక దాసు, జడ్పీటీసీ కంఠమనేని పుష్పరాజ్యం అంజిమూర్తి, ఘంటా హనుమంతరావు ఎత్తిపోతల పథకం చైర్మన్ కంఠమనేని సత్యనారాయణ, బేతిన వెంకట్రావు, సొసైటీ చైర్మన్ రేగుంట సురేష్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బాహుబలేంద్రుని బాలవర్ధిరాజు, బీజేపీ మండలాధ్యక్షులు ఎస్.ఆర్.ఆర్.ఎల్.ఎన్. రాజులతో పాటు పంచాయతీ కార్యదర్శి బి.రత్నకుమారి, వీఆర్వో కె.ప్రభాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై జీలుగుమిల్లికి బదిలీ అయిన బి.రత్నకుమారిని గ్రామస్థులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి మెమొంటో అందజేశారు. మాజీ ఎంపిటిసి డాకూరి ఆశీర్వాదం, మందలపు కృష్ణారావు, ఎస్.ఆర్.ఆర్.యర్రంరాజు(దత్తుడు) పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

లింగపాలెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెంలోని అనన్య పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్- బ్యాడ్ టచ్‌పై ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న అవగాహన కల్పించారు. శనివారం ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న స్థానికంగా ఉన్న అనన్య పాఠశాలను సందర్శించి విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులకు పోక్సోచట్టం, గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. పోలీస్ శాఖ మహిళలు, విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎన్నుకుని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పోక్సో చట్టాలు, మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ క్రైమ్ వల్ల కలిగే అనర్థాలు, అత్యవసర నంబర్‌లపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

రైతుల సమస్యలపై పోరాడాలి

కుక్కునూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. శనివారం కుక్కునూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.భూమి కోసం, భుక్తి కోసం, సామాజిక న్యాయం కోసం అణగారిన వర్గాల ఆశయాల సాధన కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. వందేళ్ల సీపీఐ ప్రస్థానంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, మడిపల్లి రమణయ్య, కారం దారయ్య, ఐతా సురేష్, వెంకటాచారి, బాబూరావు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థినులకు శిక్షణ

పెదపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులకు స్కిల్ డెవలప్‌మెంట్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో, నాంది ఫౌండేషన్, మహీంద్ర ప్రైడ్ క్లాస్ రూం సౌజన్యంతో సాఫ్ట్ స్కిల్స్‌పై శనివారం శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో ఉద్యోగ అవకాశాలు, కెరీర్ కోసం ఆంగ్ల భాష, వృత్తిపరమైన నీతి, కళాత్మకంగా మాట్లాడడం, సమూహిక చర్చ ఇంటర్వ్యూకు సిద్ధం చేయడం వంటి అంశాలపై నైపుణ్యత కలిగించారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ట్రోఫీలు అందజేశారు. కిలారు ప్రభాకరరావు, సరళ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

సీసీ టీవీ, సెక్యూరిటీ అలారంపై ఉచిత శిక్షణ

పెదపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వట్లూరులోని శిక్షణ కేంద్రంలో ఉచితంగా డిసెంబరు 1వ తేదీ నుంచి సీసీటీవీ, సెక్యూరిటీ అలారంపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సంస్థ తెలిపింది. 10వ తరగతి, ఆపై అర్హత కలిగి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 99485 65256, 90140 40780 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రామాలయానికి ఇత్తడి శిఖరం ఏర్పాటు

కామవరపుకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తాడిచర్లలోని కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో శనివారం దేవాలయంలోని ధ్వజస్తంభానికి ఇత్తడి మేఘాలు, శిఖరం ఏర్పాటు చేశారు. సంప్రోక్షణ నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, మండపారాధనలు, పంచామృత అభిషేకం, వాస్తు పూజ, హోమం నిర్వహించి నీరాజన మంత్ర పుష్పాలను సమర్పించారు. యజమానులు ఇమ్మడి సత్యనారాయణ-శ్రీదేవి దంపతులు, ఇమ్మడి స్వామి, మాణిక్యాలరావు, ఇమ్మడి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలతో ఆరాధించారు. లలితా శ్రీపీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్యశ్రీనివాసాచార్యుల బృందం పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

ఏలూరుసిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామకాల కింద ఇద్దరికి ఆఫీస్ సబార్డినేట్స్‌గా నియామక పత్రాలను జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అందజేశారు. మల్లంసూర్యచరణ్ తేజను ఏలూరు జడ్పీ కార్యాలయానికి, తాళ్ళూరి అభిశ్రీని లింగపాలెం మండల పరిషత్ కార్యాలయానికి ఆఫీస్ సబార్డినేట్‌గా పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరితో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేసిన జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

శరవేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు : ఎమ్మెల్యే చంటి



ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార యజ్ఞం నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. తాను ఎమ్మెల్యే అయిన 17 నెలల్లో ప్రతీరోజు నిరంతర ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. కొంతమంది సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతున్నాయన్నారు. కొన్ని సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరిస్తున్నారని అన్నారు. టీడీపీ నేతలు మారం హనుమంతరావు పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ

ఏలూరుఅర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థుల నిమిత్తం యూటీఎఫ్ రాష్ట్రశాఖ ముద్రించిన మోడల్ పేపర్ల బుక్‌లెట్‌ను శనివారం డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆవిష్కరించారు. సంఘ జిల్లా నాయకులు శ్యాంబాబు, సుధారాణి, రవికుమార్, రంగమోహన్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై విద్యార్థులకు పోటీలు

ఏలూరుఅర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని(డిసెంబరు 1)పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీ విజేతలు కె.శైలు, డి.మేరీజాస్మిన్, ఎల్.అనూష బృందానికి ప్రథమ బహుమతి.పి.భానుజ, ఎం.గాయత్రి బృందానికి ద్వితీయ, కె.గగన, ఎం.సోనియా అచ్యుత బృందానికి తృతీయ బహుమతి లభించాయి. పోస్టర్ ప్రజంటేషన్ పోటీలో పి.భానుజ, ఎల్. హేమ గంగారాణిశ్రీ, కెశైలు తొలిమూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు.

ఇస్లాం ధర్మం ఉగ్రవాదం నేర్పదు

ఏలూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇస్లాం ధర్మం ఉగ్రవాదం నేర్పదని జమయియ్యత్ అహ్లెహదీస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు షేక్ ఫజులు ర్రహ్మాన్ ఖురైషి ఉమరి అన్నారు. రాష్ట్ర జమయియ్యత్ అహ్లెహదీస్ మసీదులో ఫజులుర్రహ్మాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇస్లాం ధర్మంలో వికృత చేష్టలు లేవన్నారు. ఉగ్రవాదానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలకుండా కఠినంగా శిక్షించాలని కోరారు. ఉగ్రవాదులు మతం పేరు వాడుకుని ఇస్లాం ధర్మం, పవిత్రతను నాశనం చేస్తున్నారన్నారు.

క్రీడలకు ఎంపిక

కామవరపుకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో శనివారం జరిగిన ఉపాధ్యాయుల ఆటల పోటీల్లో క్రికెట్ నుండి 16 మంది ఉపాధ్యాయులు, త్రోబాల్ నుంచి ఏడుగురు ఉపాధ్యాయులు ఎంపికైనట్టు కామవరపుకోట మండల విద్యాశాఖాధికారి-2 ప్రశాంత కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియలో కామవరపుకోట హెచ్ఎం డి.వి.ఎస్.గవర్రాజు, కళ్లచెరువు హెచ్ఎం కె.జయశుభకర్, కె.కోట ఫైన్యూల్ పీడీ జి.శ్యామలాదేవిలు ఉన్నారు.

వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నవీన్ వర్మ

కుక్కునూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా చెకూరి నవీన్‌వర్మ ఎన్నికయ్యారు. మండలంలో తన బాధ్యతలు నెరవేరుస్తూ పార్టీ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానన్నారు. తనను ఎంపిక చేసినందుకు పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి, తెల్లం బాలరాజు, తాండ్ర రాజేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

పోలవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీసుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల గ్రామాల నుంచి మహిళా భక్తులు కాలినడకన భక్తుల వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ మహిళలు పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయానికి సుమారు మూడువేల మంది భక్తులు వచ్చి దర్శనాలు గోత్రనామాలతో పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సీఆర్‌ఆర్‌లో ముగిసిన వర్క్‌షాపు

ఏలూరుఅర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్ అనే అంశంపై స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపు శనివారం ముగిసింది. ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఆర్థిక విశ్లేషకుడు సి.హెచ్.విజయకుమార్ మాట్లాడుతూ ఆర్థిక ప్రణాళిక, పెట్టుబడులు, పొదుపు, ఆర్థిక క్రమ శిక్షణ ప్రాముఖ్యతలను విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ప్రతిభ

ఏలూరురూరల్, నవంబరు 29,(ఆంధ్రజ్యోతి): ప్రాగెన్స్ ఆఫ్ ఆర్ట్ బడ్స్ హైదరాబాద్ సంస్థ ఇటీవల నిర్వహించిన చిత్రకళ పోటీల్లో శనివారపుపేట జడ్పీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆ పాఠశాల హెచ్ఎం ప్రకాశరావు తెలిపారు. పోటీలకు 30 మంది విద్యార్థులు పాల్గొనగా ఐదుగురికి బంగారు పతకాలు, పది మందికి రాజా రవివర్మ జ్యూరీ హనర్ అవార్డులు లభించాయన్నారు. అవార్డులు హైద్రాబాదులో అందుకున్నారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పతకాలు అందజేశారు. డ్రాయింగ్ మాస్టారు రజనీకాంత్‌ని అభినందించారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన

ఏలూరురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో శనివారం టీచ్‌టూల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో "2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు అల్లూరి రవిప్రకాష్, వి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంస్థకు సాయం

జీలుగుమిల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ మేడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ మండల అధ్యక్షులు కూరం ప్రసాద్ జంగారెడ్డిగూడెంలో అమ్మనాన్న వికలాంగుల సేవా సంస్థకు సాయం అందజేశారు. పాములవారిగూడెనికి చెందిన ప్రసాద్ కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా రూ.9 వేలు నగదు, 25 కేజీల బియ్యం, పళ్ళు, పాలు అందజేశారు.

3న సువర్చల దాసాంజనేయస్వామి కల్యాణం

కైకలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సువర్చల సహిత దాసాంజనేయస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని డిసెంబరు 3వ తేదీన నిర్వహిస్తామని ఆలయ అర్చకులు పరిమి శివయ్య తెలిపారు. కైకలూరు కొరుకొల్లు రోడ్డులో వున్న దాసాంజనేయస్వామి ఆలయ 57వ వార్షిక కల్యాణం ఉదయం 8.48 గంటలకు నిర్వహిస్తామని, అదేరోజు స్వామివారి పంచామృతాలతో అభిషేకాలు, నూతన వస్త్రాధారణ, స్వామివారి సహస్రనామ, అష్టోత్తర శత నామ పూజలను నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాలని కోరారు.

పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

చాట్రాయి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 10,297 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోళ్లు జరిగాయని ఏవో శివశంకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1,581 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు రూ.23.33 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. మండలంలో 12,200 ఎకరాల్లో వరిసాగు జరగ్గా, ఇప్పటివరకు 7,500 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, రైతులందరి నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని ఏవో అన్నారు.



ఆక్వాటెక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని, జయమంగళ, తదితరులు

ఆక్వా రంగానికి నాణ్యమైన ఉత్పత్తులు అందించాలి

» ఆక్వాటెక్ ఎక్స్‌పోలో ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఆక్వారంగం మరింత అభివృద్ధి చెందేందుకు నాణ్యమైన రొయ్య పిల్లలను అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. శనివారం కైకలూరు సీఎస్నార్ గార్డెన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే ఆక్వాటెక్ ఎక్స్‌పో, ఎగ్జిబిషన్, సాంకేతిక సదస్సును ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కైకలూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఆక్వా రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆక్వా సాగులో నిలకడగా ఉండేందుకు నాణ్యమైన మేతలు, సీడ్, మందులను పరిశ్రమలు అందించాలని సూచించారు. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఆక్వాటెక్ నిర్వాహకులు కె.జోసఫ్, రాష్ట్ర ఆక్వారైతు సంఘం కన్వీనర్ బలరాం, తాడినాడ బాబు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఘంటశాల వెంకటలక్ష్మీ, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, లంకా రత్నారావు, అంగ్రాజు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం..

కైకలూరు/ముదినేపల్లి :వైసీపీ ప్రభుత్వంలో కొల్లేరు సమస్యపై మాట్లాడిన నాయకుడే కరువయ్యాడని కూటమి ప్రభుత్వం కొల్లేరు ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుంటే కొంతమంది విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరులో ఆయన మాట్లాడుతూ కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారానికి చూపేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొల్లేరుపై కొంతమంది అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఊటుకూరులో పూజలు

ముదినేపల్లి మండలం ఊటుకూరులో జరుగుతున్న షష్ఠి కల్యాణోత్సవాల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్ పాల్గొని హోమ పూజలు నిర్వహించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు జరిపారు.


పర్వతాపురంలో టీడీపీ శ్రేణులతో పరిశీలకుడు పల్లె శ్రీను

స్థానిక ఎన్నికల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలి

చాట్రాయి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు ఐక్యంగా నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా పనిచేయాలని నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లె శ్రీను కోరారు. టీడీపీ వీక్ బూత్‌ల వెరిఫికేషన్‌లో భాగంగా మండలంలో ని బూరుగుగూడెం, నరశింహారావుపాలెం, పర్వతాపురం, చిన్నంపేట గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి, ఆయా బూత్‌లలో టీడీపీకి తక్కువ ఓట్లు రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, పార్టీ నాయకులతో సమాలోచనలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కనీవినీ ఎరుగనిరీతిలో అమలు చేస్తున్నదని, దీనిని నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే అన్ని ఎన్నికల్లో పార్టీని విజయం దిశగా నడిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, జిల్లా తెలుగురైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గార్లపాటి మారేష్, కట్టా దుర్గారావు, తేళ్ళూరి శేఖర్, కాలసాని సూరిబాబు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎనిమిది ప్రత్యేక రైళ్లు



ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా ఎనిమిది ప్రత్యేక రైళ్లను నడుపుతు న్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్ నెంబర్ 08041 సికింద్రాబాద్ - అనకాపల్లి డిసెంబర్ 7, 14, 21, 28 తేదీలలో ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లుగా తెలిపారు. 07042 అనకాపల్లి - సికింద్రాబాద్ డిసెంబర్ 8, 15, 22, 29 తేదీలలో నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్ళు చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్లలో ఆగుతాయన్నారు. ఈ రైళ్ళల్లో ఫస్ట్‌క్లాస్ ఎసీ, సెకండ్ క్లాస్ ఎసీ, త్రి టైర్ ఎసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

రైళ్ల పొడిగింపు

రైల్ నెంబర్ 02863 సత్రగంజి - ఎలహంకకు డిసెంబర్ 4, 11, 18, 25 తేదీలలో (గురువారం) నాలుగు రైళ్ళను నడుపుతున్నారు. 02864 ఎలహంక - సత్రగంజికు డిసెంబర్ 6,13, 20, 27 తేదీలలో (శనివారం) మొత్తం నాలుగు రైళ్ళను నడుపుతున్నారు.

సారొస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధికి మరోక కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుధీర్, చింతల వాసు, కడియాల రవి శంకర్, నల్లా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం మీటింగ్‌కు ట్రాఫిక్ నియంత్రణ

డిసెంబరు 1వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చేబ్రోలు రైల్వే గేటు నుంచి దూబచర్ల, దూబచర్ల నుంచి చేబ్రోలు మార్గంలో ప్రయాణించే భారీ వాహనాలు, గూడ్స్ వెహికల్స్ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాల్సి ఉంది. సాధారణ పౌరులు, ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సులు యథావిధిగా కొనసాగుతాయని నిడమర్రు సీఐ రజనీకుమార్, చేబ్రోలు ఎస్ఐ ఎం. సూర్య భగవాన్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

కోటపాడు సచివాలయం ఖాళీ !

» సిబ్బంది లేక ప్రజలకు తప్పని అవస్థలు

చాట్రాయి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామ సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలల క్రితం జరిగిన బదిలీలలో ప్రధాన పోస్టులు భర్తీ కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఏఎన్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ మాత్రమే ఉండగా, వీరు ఉదయం పది గంటలకు ఆఫీస్ తెరిచి ఫీల్డ్ వర్కుకి అని బయటకు వెళుతుండంతో సచివాలయంలో ఎవరూ ఉండడం లేదని, వచ్చిన వారికి సమాధానం చెప్పే నాధుడు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజలు తమ పనుల కోసం సచివాలయానికి వచ్చి గంటల తరబడి నిరీక్షించి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోటపాడు సచివాలయానికి కనీసం డిజిటల్, వెల్ఫేర్ పోస్టులు భర్తీ చేసి పనులు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సిబ్బంది లేక ఖాళీ కుర్చీలతో వున్న కోటపాడు సచివాలయం


రైతులకు రుణాలు అందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామ్మోహనరావు

రైతులకు రూ.3.33 కోట్లు రుణాలు పంపిణీ

చాట్రాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి పీఏసీఎస్ సభ్యులైన 81 మంది రైతులకు శనివారం రూ 3.33 కోట్లు రుణాలను పీఏసీఎస్ ఛైర్మన్ తుమ్మల రామ్మోహనరావు శనివారం పంపిణీ చేశారు. ఇందులో 36 మంది రైతులకు పంట రుణాలు రూ.45.41 లక్షలు, 45 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.2.85 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు కాలసాని సత్యనారాయణ, దివ్వెల జయరాజు, సీఈవో పి.శ్రీనివాసరావు, జనసేన నాయకులు తుమ్మల జగన్, కరుణాకర్, వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.


ముసునూరు పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా అదనపు డీఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ

కుష్ఠువ్యాధి బాధితుల సర్వేను సమగ్రంగా చేయాలి

ముసునూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో కుష్ఠువ్యాధి బాధితుల గుర్తింపునకు చేపట్టిన సర్వేను సమగ్రంగా నిర్వహించాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం కాట్రేనిపాడులో ఆశావర్కర్లు చేస్తున్న సర్వేను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ముసునూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఆసుపత్రి రికార్డులు పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కుష్ఠువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులకు అవగాహన కల్పించాల్సిన విషయాలపై వైద్యులు, సిబ్బందికి సూచించారు. సర్వేను త్వరితగతిన పూర్తిచేసి, నివేదికను అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిజియోథెరపిస్టు డాక్టర్ చక్రధర్, వైద్యాధికారిణి డాక్టర్ భవాని, ఎంపీహెచ్ఎస్ మురళీమోహన్, హెల్త్ అసిస్టెంట్ దుర్గారావు పాల్గొన్నారు.

'ఆ మూడు సమస్యలను పరిష్కరించండి'

నూజివీడు టౌన్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యం తాగునీరు, కోతుల బెడద ఏ సమావేశంలో చూసినా ఈ మూడు సమస్యలు పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలంటూ కౌన్సిల్ సభ్యులు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించినా అంతర్గత రహదారుల్లో పారిశుధ్య కొరత కనిపిస్తోందన్నారు. తాగునీటి సరఫరాల్లో ఒకరోజు తాగునీరు సరఫరా అయితే మూడు రోజులు నిలిచిపోతోందని కృష్ణా జలాల తరలింపు పథకం పైప్‌లైన్ ఎప్పుడు లీకులు ఏర్పడతాయో ? ఎప్పుడు తాగునీరు సరఫరా అవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా కోతుల బెడదపై ప్రతి సమావేశంలోనూ కౌన్సిల్ దృష్టి తీసుకురావడం జరుగుతోందని కోతులను పట్టి అరణ్యాలకు తరలించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నూజివీడు మున్సిపల్ కమిషనర్ పేరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఊరు వెళ్లి వచ్చేసరికి చోరీ

వెండి, బంగారపు వస్తువుల అపహరణ

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి ఊరువెళ్ళేటప్పటికి దొంగలు ఆ ఇంటి తలుపులు పగలగొట్టి ఆ ఇంట్లో ని బీరువాను పగులగొట్టి వెండి, బంగారపు వస్తువులను అపహరించుకుపోయారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం ద్వారకానగర్‌లో శాంతి వెంకట సుబ్రహ్మణ్యం తన కుటుంబంతో ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం విజయవాడలోని బంధువుల ఇంటికి కుటుంబంతో సహా వెళ్ళారు. ఇంటికి తాళాలు వేశారు. ఆ ఇంటికి సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. ఈనెల 28వ తేదీ రాత్రి తన ఫోనుకు సీసీ కెమెరాల కనెక్షన్ ఉండడంతో చూడగా కెమెరాలు పక్కకు తిప్పివేసి ఉన్నాయి. దీంతో ఆయన వచ్చి చూసేసరికి బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలోని పావుకేజీ వెండి వస్తువులు, మూడున్నర కాసుల బంగారపు వస్తువులు అపహరణకు గురైనట్లుగా గుర్తించి శనివారం ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రథం వద్ద పూజలు చేస్తున్న ఏసీ, కమిటీ సభ్యులు
తెప్పోత్సవానికి హంస వాహనం సిద్ధం

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం

ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : షష్ఠి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సింగరాయపాలెం- చేవూరుపాలెం సెంటరులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తుల జయధ్వానాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి రథోత్సవం సింగరాయపాలెం, శ్రీహరిపురం, చేవూరుపాలెం గ్రామాల వీధుల్లో నిర్వహించారు. ఇంటింటా భక్తులు స్వామివార్లకు పూజలు జరిపారు. తొలుత దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, పరసాకృష్ణ, బెజవాడ నాగ వెంకట రాధాకృష్ణ, ఉప్పలపాటి విమల, దగాని నాగలక్ష్మి తదితరులు రథోత్సవ పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. కైకలూరు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు దంపతులు, మాజీ జడ్పీటీసీ వీరమల్లు రత్నకుమారి దంపతులు శనివారం పుట్టలో పాలుపోసి పూజలు జరిపారు.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు

వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తెప్పోత్సం ఆదివారం రాత్రి నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం పక్కనే ఉన్న పుష్కరిణిలో స్వామివార్ల తెప్పోత్సవం నిర్వహించేందుకు హంసను పోలిన విధంగా తెప్పను పటిష్టంగా రూపొందిస్తున్నారు. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు సుమారు 30 నుంచి 40 వేల మంది జనం తరలివచ్చే అవకా శం ఉన్నందున భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్నిమాపక దళ వాహనాన్ని సిద్ధం చేశారు. సుమారు 150 మంది పోలీసులతో తెప్పోత్సవానికి బందోబస్తు నిర్వహించనున్నారు.


ముసునూరు మండలస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ముసునూరు/ఆగిరిపల్లి/చాట్రాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలోని మూడు కస్టర్ల ఉపాధ్యాయులకు ముసునూరు జడ్పీ పాఠశాలలో క్రికెట్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులను గుర్తించి మండలస్థాయి పోటీలకు ఒక జట్టును ఎంపిక చేసినట్టు ఎంఈవో-1 సుభాషిని, ఎంఈవో-2 బి.వి.యస్ సుబ్బారావు తెలిపారు. విజేతలు డివిజన్ స్థాయిలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

● ఆగిరిపల్లి మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను ఎంఈవోలు శిలారపు హేబేలు, కొవ్వలి ఆనంద్‌కుమార్, పులి పుష్పలత ప్రారంభించారు. మండలంలో త్రోబాల్ ఆటలను ఆడించి డివిజనల్ లెవల్‌కు అర్హత కలిగినవారిని ఎంపిక చేశామన్నారు. ఈదులగూడెం, అడవినెక్కలం హెచ్ఎంలు తాడి ప్రసాద్, పీవీ రమణ, మండల క్రీడల కో-ఆర్డినేటర్ ఎస్.శివనాగేంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.సుగుణరావు, పి.నాగేశ్వరరావు, హర్ష, ఉమా మహేశ్వరి, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చాట్రాయి మండలంలోని చిన్నంపేట జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు, చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు శనివారం నిర్వహించారు. చిన్నంపేటలో క్రికెట్ పోటీలను ఎంఈవో-1 ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. చిన్నంపేటలో నాలుగు క్లస్టర్ టీమ్‌లు తలపడగా చిన్నంపేట జట్టు విజయం సాధించి, డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్రీడాకారులను నూజివీడు డీవైఈవో సుధాకర్ తదితరులు అభినందించారు.

● **అప్సా ఆధ్వర్యంలో**

నూజివీడు టౌన్:నూజివీడు డివిజన్ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ (అప్సా) డెమోక్రటిక్ ఆధ్వర్యంలో బాలుర క్రీడా పోటీలను త్రివిధ పాఠశాల వేదికగా శనివారం ప్రారంభించారు. నూజివీడు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పీఎస్ సుధాకర్ ఈ పోటీలను ప్రారంభించగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో డివిజన్ పరిధిలోని 12 పాఠశాలలు పాల్గొన్నాయి. విజేతలకు సాయి ప్రణీత పాఠశాల డైరెక్టర్ అనురాధ బహుమతులను అందజేశారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జైలులో ఖైదీలకు ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులపై వైద్యులు నాగేశ్వరరావు, నాగేశ్వరి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా జైల్ పర్యవేక్షణాధికారి డి.నరసింహారా రెడ్డి మాట్లాడుతూ ఖైదీలకు అవసరమైన సహాయం అందిస్తున్నామని, వారిలో సరైన మార్పుకు కృషి చేస్తున్నామన్నారు. క్లబ్ అధ్యక్షులు బీవీవీ సత్యనారాయణ, లయన్స్ జిల్లా నాయకలు ఎల్ వెంకటే శ్వరరావు, సీనియర్ అడ్వకేట్ కూన కృష్ణారావు, జైలర్స్ వి.రమేష్, కె.శ్రీనివాసరావు, డిప్యూటీ జైలర్ కేవీ వసంతరావు పాల్గొన్నారు.


ఎల్‌ఓసీ చెక్కును లబ్ధిదారునికి అందిస్తున్న మంత్రి సారథి

పేదల వైద్యానికి చేయూత 'సీఎం సహాయ నిధి'

నూజివీడు టౌన్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): పేదల మెరుగైన వైద్యానికి చేయూత ముఖ్యమంత్రి సహాయనిధి అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం ముక్కోల్లుపాడు గ్రామానికి చెందిన వి విజయ్ కుమార్ గుండె చికిత్సకు అతడి కుటుంబ సభ్యులకు సుమారు రూ.3.50 లక్షల సీఎం సహాయనిధి ఎల్‌ఓసీ చెక్కును అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శిగా రాము


జి.రాము

చాట్రాయి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా ఆర్థిక కార్యదర్శిగా జి.రాము ఎన్నికయ్యారు. ఇటీవల ఏలూరులో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎస్కే మహబు, జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీగా ఎం.పుల్లారావు, జిల్లా కార్యదర్శిగా ఎ.విజయ్‌భాస్కర్ ఎన్నికైనట్టు ప్రకటించారు. జిల్లా కార్యవర్గంలో చాట్రాయి మండలానికి చెందిన జి.రాముకు ప్రాధాన్యత ఇచ్చినందుకు జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు వీబీవీఎస్ఎల్ నారాయణ, కేఆర్ పవన్‌కుమార్‌లకు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.అమరయ్య, ఎస్.నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు.



కలిదిండిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

కలిదిండి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ గీత అన్నారు. శనివారం కలిదిండి సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రెవెన్యూ అధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సామాన్యుడి చేతిలో సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం వంటిదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారం ఈ చట్టం ప్రజలకు కల్పించిందన్నారు. ఆర్ఐ శ్యామల, మండల వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపు భోగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులపై సమావేశం

కలిదిండి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన డిసెంబరు 2వ తేదీన ఆలయం వద్ద సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో స్వామివారి ఆలయం ఆవరణం కొద్దిపాటి వర్షానికే జలమయమవుతుందని పనులు వేగవంతం చేయాలని భక్తులు సూచనలు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఆహా.. వియ్యపురాలి జీళ్లు

షష్ఠి ఉత్సవాల్లో నోరూరించే జీళ్ల తయారీ

ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వియ్యపురాలి జీళ్లంటే ఓ విశిష్టత. సంప్రదాయంగా చూస్తే ఈ జీళ్లకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. పూర్వం వివాహం జరిగిన అనంతరం కుమార్తెను అత్త వారింటికి కొత్తగా కాపురానికి పంపే సమయంలో సారెతోపాటు వియ్యపురాలి నోరు తీపి చేసేందుకు ఉభయ గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా జీళ్లను పంపించడం సంప్రదాయం. రానురాను గోదావరి జిల్లాల జీడీల ఆచారం కృష్ణా జిల్లాకు వ్యాపారంగా తరలివచ్చింది. ఉత్సవాల సమయంలో దేవస్థానాల వద్ద వియ్యపురాలి జీళ్ల వ్యాపారం జోరుగా సాగడం ఆనవాయితీగా మారింది.

ఉత్సవాల్లో జీళ్లదే హవా!

ముదినేపల్లి మండలం సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఏటా ఒకసారి జరిగే సుబ్రహ్మణ్య షష్ఠి కల్యాణోత్సవాల్లో వియ్యపురాలి జీళ్లదే వ్యాపార హవా సాగుతుంది. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులు ఈ జీళ్లను కొనుగోలు చేస్తారు. కళ్లెదుటే వ్యాపారులు అరగంటలో తాజాగా జీడీలను తయారు చేసి అమ్ముతారు. వీటి తయారీ ప్రక్రియ బెల్లం ముక్కలను పాకం చేసి, పాకాన్ని సాగదీసి, గట్టి కడ్డీలుగా తయారు చేసి జీడీలుగా నరకడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ జీళ్ల తయారీకి ముడి సరుకు బెల్లం మాత్రమే రెండో పదార్థం ఉండదు. నిపుణులైన పనివాళ్లు మాత్రమే అవసరం. కేజీ జీళ్లను రూ.175 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు.


బెల్లపు పాకాన్ని కడ్డీగా తయారు చేస్తున్న వ్యాపారి


జీళ్లు.. పాకం పడుతున్న బెల్లపు ముక్కలు




బెల్లపు పాకం కడ్డీ నుంచి జీడి ముక్కల చేస్తున్న దృశ్యం

సంప్రదాయమే వృత్తిగా మారింది



గోదావరి జిల్లాలో పెళ్ళిళ్ల సమయాల్లో పూర్వీకుల నాడు వియ్యపురాలి జీడీలు ఆచార సంప్రదాయం కోసం తయారు చేసి అమ్మేవారు. అది మా తరానికి వ్యాపారంగా మారింది. పెట్టుబడి పెరిగి ప్రస్తుతపరిస్థితుల్లో ఈ వ్యాపారం లాభసాటిగా లేకున్నా పూర్వీకుల సంప్రదాయం కొనసాగిస్తున్నాం.

- నాగరాజు, జీడీల తయారీదారు, అమలాపురం

గంగానమ్మ ఆలయంలో చోరీ

ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెదపాలపర్రులోని గంగానమ్మ ఆలయంలో హుండీల సొమ్ము చోరీకి గురైంది. శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎలిశెట్టి లక్ష్మీ నరసింహారావు, సభ్యులు ఆదివారం జరుగ నున్న అమ్మవారి జాతర విషయమై చర్చించేం దుకు ఆలయానికి వెళ్లగా, హుండీ పగులకొట్టి ఉండడం గమనించారు. దీనిపై నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నారు. హుండీలోని సుమారు రూ. 4 వేల అపహరణకు గురై ఉంటాయని భావిస్తున్నారు.